

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY


ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787


PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 26-05-2022 సంపుటి: 03 సంచిక: 247 పేజీలు: 4 వెల: రూ 3-00

# ఉద్రిక్తతంగా 'కోనసీమ'

కాకినాడ, మే 25, (న్యూస్ పల్స్) కోనసీమ జిల్లా పేరు మార్పు తీవ్ర ఉద్రిక్తతకు దారి తీస్తోంది. కోనసీమ జిల్లా పేరు మార్చడాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనకారులు చేపట్టిన నిరసన కార్యక్రమం తీవ్రరూపం దాల్చింది. అమలాపురంలో లా అండర్ ఆర్డర్ అదుపు తప్పింది. మంత్రి ఇంటికి నిప్పు పెట్టిన ఆందోళనకారులు.. ఎమ్మెల్యే ఇంటిపై అటాక్ చేశారు. అసలు ప్రశాంతమైన కోనసీమ రణక్షేత్రంగా ఎలా మారింది..? అసలేం జరిగింది..? వివాదమేంటి?ఏపీలో కొత్త జిల్లాలు వచ్చాయి. 13 జిల్లాల నవ్యాంధ్ర.. 26 జిల్లాల ఆంధ్రప్రదేశ్‌గా మారింది. కొత్త జిల్లాల ప్రతిపాదనలపై మార్చి 7వ తేదీ వరకు అభ్యంతరాలు, సూచనలు స్వీకరించింది. మండలాలు, డివిజన్ల మార్పు, కూర్పుతోపాటు పేర్లపై సుమారు 12 వేల 600 అభ్యంతరాలు వచ్చాయి. అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్న సర్కార్.. స్వల్ప మార్పులతో కొత్త జిల్లాలను ఖరారు చేసింది. ఈక్రమంలోనే? ఏపీలోని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో భాగమైన అమలాపురం నియోజకవర్గం జిల్లాల పునర్ వ్యవస్థీకరణలో కొత్త జిల్లాగా




మారింది. ప్రభుత్వం దీనికి కోనసీమ జిల్లాగా నామకరణం చేసింది. జిల్లాలో అత్యధికంగా ఉన్న ఎస్సీ జనాభా మనోభావాల మేరకు కోనసీమ జిల్లాను కాస్తా అంబేద్కర్ జిల్లాగా పేరు మార్చాలన్న డిమాండ్లు వినిపించాయి. అమలాపురం కేంద్రంగా ఏర్పడిన కోనసీమ జిల్లాకు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టాలనే డిమాండ్ రోజురోజుకు పెరిగింది. ఇందుకోసం అంబేద్కర్ జిల్లా సాధన సమితి నేతృత్వంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. జిల్లాల విభజన ప్రక్రియ నేపథ్యంలో పలు కొత్త జిల్లాలకు దివంగత నేతల పేర్లు పెట్టడంతో?. కొత్తగా ఏర్పడిన కోనసీమ జిల్లాకు సైతం అంబేద్కర్ లేదా బాలయోగి పేరు పెట్టాలనే డిమాండ్లు వినిపించాయి. కాపునేత ముద్రగడ పద్మనాభం సైతం జగన్ కు ఇదే డిమాండ్ చేశారు. తొలుత మౌనంగా ఉన్న ప్రభుత్వం.. తర్వాత.. అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని కీలక నిర్ణయం తీసుకుంది. కొనసీమ జిల్లా పేరును.. డాక్టర్ అంబేద్కర్ కొనసీమ జిల్లాగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ పేరును కోనసీమ జిల్లాకు పెట్టడం ద్వారా ప్రభుత్వం సమంజమైన నిర్ణయమే తీసుకుందని ఎంతో మంది పార్టీలకతీతంగా అభినందించారు. కానీ? జిల్లాలో కొన్ని కులాల నేతలు, మద్దతుదారులు మాత్రం దీనిపై నిరసనలకు దిగారు. పలు చోట్ల దాడులు కూడా జరిగాయి. దీంతో పలు నియోజకవర్గాల్లో పరిస్థితులు ఉద్రిక్తంగా మారింది. అంబేద్కర్ జిల్లా పేరును వ్యతిరేకిస్తూ నిరసనలకు దిగారు. అంబేద్కర్ జిల్లా పేరును కోనసీమకు పెట్టడాన్ని స్వాగతిస్తూ కొందరు, వ్యతిరేకిస్తూ మరికొందరు? పోటా పోటీగా ర్యాలీలు నిర్వహిస్తుండటం, అవి కాస్తా ఉద్రిక్తతలకు వేదికవుతుండటంతో పోలీసులు కూడా దీన్ని సీరియస్‌గా తీసుకున్నారు. ఇప్పటికే జిల్లాలో పలు చోట్ల ఇలాంటి వివాదాలు పెరుగుతుండటం, ఇవి దాడులకు కూడా దారితీస్తుండటంతో పోలీసులు చేసేది లేక 144 సెక్షన్ విధించారు. 144 సెక్షన్ అమల్లోకి రావడంతో పోలీసులు కూడా గట్టిగా నిఘా పెట్టారు. అమలాపురం జిల్లాకు కోనసీమ పేరునే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ కోనసీమ సాధన సమితి చేపట్టిన నిరసన కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తంగా మారింది. కోనసీమ జిల్లా పేరు మార్చడాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనకారులు చేపట్టిన నిరసన కార్యక్రమం తీవ్రరూపం దాల్చింది. అమలాపురం ఎస్పీ సుబ్బారెడ్డిపై ఆందోళనకారులు రాళ్లతో దాడులకు తెగబడ్డారు. ఈ దాడిలో ఎస్పీ సుబ్బారెడ్డి తలకు తీవ్రగాయాలు అయ్యాయి. ఈ దాడుల్లో 20 మందికి పైగా పోలీసులు గాయపడ్డారు.



అమలాపురం డీఎస్పీ సొమ్మసిల్లిపడిపోయారు. ఆందోళనకారులు భీకరమైన విధ్వంసం సృష్టిస్తున్నారు. నిరసనకారుల దాడుల్లో ఎస్పీ సహా 20 మంది పోలీసులకు తీవ్ర గాయాలయ్యాయి. 3 ఆర్టీసీ బస్సులను ధ్వంసం చేశారు. 2 ప్రైవేటు బస్సులకు నిప్పు పెట్టారు. జిల్లా పేరు మార్పును వ్యతిరేకిస్తూ స్థానిక మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ ఇళ్లపైనా దాడులు చేశారు ఆందోళనకారులు. మొదట మంత్రి విశ్వరూప్ ఇంటిపై అటాక్ చేసిన నిరసనకారులు.. ఆయన ఇంటికి నిప్పు పెట్టారు. దాంతో ఆయన ఇల్లు మొత్తం అగ్నికి ఆహుతైంది. ఆ తరువాత ఎమ్మెల్యే సతీష్ ఇంటిపై అటాక్ చేసిన ఆందోళనకారులు.. ఆయన ఇంటికి కూడా నిప్పు అంటించారు. ఎమ్మెల్యే ఇంటి పర్నీచర్‌ను ధ్వంసం చేశారు. పరిస్థితి ఎంతకీ కంట్రోల్‌లోకి రాకపోవడంతో పోలీసులు సీరియస్ యాక్షన్ తీసుకోవాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా మొదటి హెచ్చరిక కింద ఉన్నపళంగా ఆందోళనలు విరమించాలని ఆందోళనకారులను ఆదేశించారు. లేదంటే కాల్పులు జరపాల్సి వస్తుందంటూ సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. ఈ మేరకు గాల్లోకి కాల్పులు జరిపారు పోలీసులు.

# ఆనాడే అంబేద్కర్ పేరు పెట్టి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు: పవన్ కల్యాణ్



మంగళగిరి: కోనసీమ ప్రాంతానికి రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పేరు పెట్టారని.. జిల్లాలకు కొత్త పేర్లు పెట్టేటప్పుడే అంబేద్కర్ పేరు కూడా పెడితే బాగుండేదని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయం నుంచి పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడారు. ఆనాడే అంబేద్కర్ పేరు పెట్టి ఉంటే ఇవాళ ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదన్నారు. జిల్లాకు అంబేద్కర్ పేరు పెట్టడంలో ప్రభుత్వం ఎందుకు జాప్యం చేసిందో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. ఒక నిర్ణయం తీసుకునేటప్పుడు సాధారణంగా కొంత వ్యతిరేకత ఉంటుందన్నారు. అయితే పేర్లు పెట్టేటప్పుడు ప్రభుత్వం సున్నితంగా వ్యవహరించాల్సిందని పవన్ అభిప్రాయపడ్డారు."రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన పొట్టి శ్రీరాములును ఒక జిల్లాకు కుదించారు. ఆంధ్ర రాష్ట్రానికి గుండెకాయ లాంటి వ్యక్తిని జిల్లాకు పరిమితం చేశారు. కృష్ణా నది తక్కువగా ఉన్న చోట కృష్ణా జిల్లా పేరు పెట్టారు. కృష్ణా నది ఎక్కువగా ఉన్న చోట ఎన్టీఆర్ జిల్లా అని పెట్టారు. జిల్లాల పేర్లకు వ్యతిరేకమైనా.. వ్యక్తులకు వ్యతిరేకం కాదు. మిగతా జిల్లాలతో పాటు కోనసీమ జిల్లాకు అంబేద్కర్ అని పెడితే సహజంగా ఉండేది. అభ్యంతరాలు ఉంటే 30 రోజులు సమయం ఇస్తున్నామన్నారు. మిగతా జిల్లాలకు సమయం ఇవ్వకుండా కోనసీమకే ఎందుకు సమయమిచ్చారు? గొడవలు జరగాలనే అభ్యంతరాలకు సమయం ఇచ్చారా?30 రోజుల సమయమిచ్చి కలెక్టరేట్‌కు రమ్మని చెప్పారు. సామూహికంగా కాదు.. వ్యక్తులుగా రావాలని సూచించారు. ఇది ముమ్మాటికీ వ్యక్తులను టార్గెట్ చేయడమేనని జనసేన భావిస్తోంది. 30 రోజుల గడువు ఎందుకు? గొడవలు జరగాలని కాదా? మంత్రి విశ్వరూప్ ఇంటిపై దాడి జరుగుతుంటే పోలీసులు చూస్తూ ఊరుకుంటారా? పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారంటే ఏమనుకోవాలి?దాడి జరుగుతుంటే ఇంటికి రక్షణగా ఉండాలి కదా? విశ్వరూప్ ఇంటిపై దాడికి ముందు మంత్రి కుటుంబసభ్యులను తరలించారు. ముందే తరలించారంటే దాడి జరుగుతుందని పోలీసులకు ముందే తెలుసా? పోలీసులకు ముందే తెలిసినా బందోబస్తు పెట్టలేదంటే ఏమనాలి?ఘోరాలను ఆపకుండా జరిగేలా చేస్తారా? పైపెచ్చు జనసేనపై ఆరోపణలు చేస్తూ కులసమీకరణపై రాజకీయాలు చేస్తున్నారు. భావోద్వేగాలు ఉంటాయని తెలిసే రెచ్చగొట్టారు" అని పవన్ ఆరోపించారు. మూడు రోజుల క్రితం వైకాపా ఎమ్మెల్సీ.. తన డ్రైవర్‌ను చంపేశారు. చంపి వాళ్ల ఇంటికే వెళ్లి మృతదేహం అప్పగిస్తారా?మృతుడు ఎస్సీ వ్యక్తి కావడంతో వ్యతిరేకత వచ్చింది. ప్రజల దృష్టి మళ్లించేందుకే కోనసీమలో గొడవలు రేపారు. ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడంలో సీఎం జగన్ నేర్పరి. అమలాపురం విధ్వంసంలో కీలకంగా వ్యవహరించిన అన్యం సాయి వైకాపా నేతే. వాస్తవాలు స్పష్టంగా ఉంటే హోంమంత్రి విపక్షాలపై నిందలు వేస్తారా? సజ్జల, విశ్వరూప్‌తో అన్యం సాయి ఉన్న ఫొటోలు అచ్చెన్నాయుడు విడుదల చేశారు. కోనసీమకే పేరు పెట్టడం వెనుక ప్రభుత్వ ఆలోచన ఏంటి? కడప జిల్లాకు అంబేద్కర్ పేరు పెట్టొచ్చు కదా? కులాల మధ్య ఘర్షణ రావణకాష్టం లాంటిది. కులాల పేరుతో గొడవలు జరిగితే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం కాదు. వైకాపా ప్రభుత్వం బాధ్యత వహించాలి. యువత ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి. ఇలాంటి వారి ఉచ్చులో పడొద్దని మనవి చేస్తున్నాను. వైకాపా నేతలు గొడవలు తగ్గించే ప్రయత్నం చేయండి. సజ్జల వంటి పెద్దల అనుభవం కుల ఘర్షణలకు కారణం కాకూడదు" అని పవన్ కోరారు."కోనసీమ ఘటన ఒక కులానికి సంబంధించినది కాదు. కోనసీమ ప్రజలు సంయమనంగా ఉండాలి. అంబేద్కర్ వంటి మహనీయుడిని జిల్లాకు పరిమితం చేస్తారా? రాజకీయ లబ్ధికోసం అంబేద్కర్ పేరును వాడుకుంటున్నారు.

# యూనికార్న్ సంస్థల సీఈవోలతో సీఎం జగన్ భేటీ



దావోస్: వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సు సందర్భంగా ఏపీలో పెట్టుబడులకుగల అపార అవకాశాలను పారిశ్రామికవేత్తలతో పాటు యంగ్ ఎంట్రప్యూనర్లకు వివరిస్తున్నారు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్. స్టార్టప్‌లతో తమ కెరీర్‌ను ప్రారంభించి వాటిని యూనికార్న్ స్థాయికి తీసుకెళ్లిన పలువురు సీఈవోలతో జగన్ భేటీ అయ్యారు. బుధవారం సీఎం జగన్‌ను కలిసిన వారిలో మీషో వ్యవస్థాపకుడు, సీఈఓ విదిత్ ఆత్రేయ, బైజూస్ వైస్ ప్రెసిడెంట్, పబ్లిక్‌పాలసీ సుష్మిత్ సర్కార్, కాయిన్‌స్విచ్ క్యూబర్ వ్యవస్థాపకుడు, గ్రూప్ సీఈఓ ఆశిష్ సింఘాల్, ఈజీమై ట్రిప్ ప్రశాంత్‌పిట్టి, వీహివ్.ఏఐ వ్యవస్థాపకుడు సతీష్ జయకుమార్, కౌర్‌సెరా వైస్ ప్రెసిడెంట్ కెవిన్ మిల్స్ ఉన్నారు.

# అమలాపురం ఘటన వెనుక కుట్ర.. వదిలేదే లేదు: మంత్రి బొత్స

అమరావతి: అమలాపురం ఘటన దురదృష్టకరమని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన వెనక కుట్ర దాగి ఉందని ఆరోపించారు. పచ్చని కోనసీమలో చిచ్చు పెట్టారని మండిపడ్డారు. ఈ అల్లర్ల వెనక ఎవరున్నారో అందరికీ తెలుసన్నారు. ఎవరు



తప్పు చేసినా వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మంత్రి, ఎమ్మెల్యే ఇంటికి నిప్పు పెట్టడం హేయమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి పరిణామాలు మంచివి కావని హితవు పలికారు. స్వార్థ రాజకీయాల కోసం విపక్షాల కుట్రను ప్రజలు గమనించాలని మంత్రి బొత్స పేర్కొన్నారు. రాజకీయ లబ్ధి పొందాలని చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఆలోచన అని అన్నారు. అంబేద్కర్ పేరు పెట్టాలన్న నేతలు ఇప్పుడు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. అమలాపురంలో కాల్పులు జరిగితే లబ్ధి పొందాలని పవన్ చూస్తున్నారా అని నిలదీశారు. పోలీసులు సంయమనం పాటించి ప్రాణ నష్టం లేకుండా నివారించారన్నారు.'మంత్రి, ఎమ్మెల్యేల ఇంటిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నా. అంబేద్కర్ ఒకకులానికో, ఒక ప్రాంతానికో చెందిన వ్యక్తి కాదు. అంబేద్కర్ రాజ్యాంగ సృష్టి కర్త. ఈరోజు మనం స్వేచ్చగా జీవించడానికి అంబేద్కర్ రాజ్యాంగమే కారణం. అటువంటి మహానుభావుడు పేరు పెడితే ఎందుకు అల్లర్లకి పాల్పడ్డారు. అన్ని పార్టీలు, అన్ని కులాలు, అన్ని వర్గాల ప్రజలు కోనసీమకి అంబేద్కర్ పేరు పెట్టాలని కోరిన మీదటే సీఎం నిర్ణయం తీసుకున్నారు. అంబేద్కర్ పేరు పెడితే తప్పేంటి. ఏం సాధించాలని అమలాపురంలో చిచ్చు పెట్టారు. ఇది మంచి సంప్రదాయంకాదు. శాంతిభద్రతల పరిరక్షణపై ఉపేక్షించేది లేదు. ఈ ఘటనలో ప్రమేయమున్నవారిని కఠినంగా శిక్షిస్తాం' అని మంత్రి బొత్స అన్నారు.

# మరో యుద్ధాన్ని తలపించేలా అమలాపురం ఘటన: సోము వీర్రాజు

అమరావతి: కోనసీమలో జరిగిన ఘటనకు పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమే కారణమని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు విమర్శించారు. అమలాపురంలో మంగళవారం చోటుచేసుకున్న ఉద్రిక్త పరిస్థితులు మరో యుద్ధాన్ని తలపించాయని తెలిపారు. ఆ యుద్ధం జరగడానికి ఏపీ సీఎం జగన్ వైఖరే కారణమని ఆరోపించారు. సుబ్రహ్మణ్యం హత్య కేసులో వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబు



పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలం తప్పన్నారు. వెంటనే ఎమ్మెల్సీ అనంతబాబును పార్టీ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసును పోలీసులు సమగ్రంగా విచారణ చేయాలని సోము డిమాండ్ చేశారు."రాష్ట్ర ప్రభుత్వం కోనసీమలో ఒక చిచ్చును పెట్టింది. అక్కడి వాతావరణం ఉద్రిక్తంగా మారింది. అమలాపురం ఘర్షణలో భాజపా శ్రేణులు పాల్గొనడం గానీ, మద్దతు ఇవ్వడం గానీ చేయలేదు. నెల రోజులు గడిచిన తర్వాత అంబేద్కర్ పెరు పెడుతున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. మొదట అంబేద్కర్ జిల్లా అని పెట్టి ఉంటే ఈస్థాయి ఉద్రిక్తత చోటుచేసుకునేది కాదు. మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్లు దగ్ధం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రజలు సంయమనం పాటించాలి. కోనసీమ జిల్లా పేరు మార్పు విషయంలో రాజకీయ పార్టీలు అంగీకరించినట్టు అధికారికంగా ధ్రువీకరణ పత్రం ఇచ్చారా" అని ప్రభుత్వాన్ని సోము ప్రశ్నించారు.

# రాజ్యసభ స్థానాలకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల నామినేషన్లు



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించి నాలుగు రాజ్యసభ స్థానాలకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. రాజ్యసభ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి, జాతీయ బీసీ ఉద్యమ నేత ఆర్.కృష్ణయ్య, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి, బీద మస్తాన్‌రావులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంపిక చేశారు. వారు నలుగురూ బుధవారం నామినేషన్లు దాఖలు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి అయిన రాష్ట్ర శాసన మండలి ఉప కార్యదర్శి పీవీ సుబ్బారెడ్డికి నామినేషన్ పత్రాలను అందజేశారు. నామినేషన్ల దాఖలు చేసిన అనంతరం విజయసాయిరెడ్డి, ఆర్ కృష్ణయ్య, బీదా మస్తాన్‌రావు, నిరంజన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర సమస్యలను పార్లమెంట్‌లో వినిపిస్తామన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ బలం 9కి చేరిందని.. 9 మంది ఎంపీల్లో ఐదుగురు బీసీ వర్గాలకు చెందినవారని పేర్కొన్నారు. ఇది బీసీ వర్గాలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శమన్నారు. రాష్ట్రపతి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు కీలకమన్నారు. దేశ, రాష్ట్ర ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకుంటామన్నారు. ఏపీలో ఖాళీ కానున్న ఈ నాలుగు స్థానాల్లో ఎన్నికల నిర్వహణకు మంగళవారం రిటర్నింగ్ అధికారి పీవీ సుబ్బారెడ్డి నోటిఫికేషన్‌ను జారీచేశారు. దీంతో మంగళవారం నుంచే నామినేషన్ల ఘట్టం ప్రారంభమైంది. ఈనెల 31వ తేదీ మ.3 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. వీటిని జూన్ 1న ఉ.11 గంటలకు పరిశీలిస్తారు. జూన్ 3వ తేదీ మ.3 గంటల్లోగా నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చు.



నలుగురు అభ్యర్థుల కంటే ఎక్కువమంది పోటీలో ఉంటే జూన్ 10న ఉ.9 గంటల నుంచి మ.4 గంటల వరకూ పోలింగ్ నిర్వహిస్తారు. ఇక శాసనసభలో వైఎస్సార్‌సీపీకి 150 మంది సభ్యుల బలం ఉంది.

# సంపాదకీయం

**గురువారం 26-05-2022**

## అప్పుల కుప్పగా తెలుగు రాష్ట్రాలు

అప్పు చేసి పప్పు కూడు అన్న చందంగా మారింది తెలుగు రాష్ట్రాల పరిస్థితి. అవసరానికో అప్పు చేయడంలో తెలుగు రాష్ట్రాలు టాప్‌లో నిలిచాయి. అప్పులు తీసుకోవడంలో దేశంలో ప్రస్తుతం ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు పోటీపడి మరీ దూసుకుపోతున్నాయి. ఎక్కడ దొరికితే అక్కడ అప్పులు చేస్తున్నాయి. దేశంలో అత్యధిక రోజులు అప్పులు చేసిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ టాప్‌లో నిలిచింది. 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆర్బీఐ నుంచి స్పెషల్ డ్రాయింగ్ ఫెసిలిటీ తీసుకున్న రాష్ట్రాల్లో ఏపీ టాప్ ప్లేస్‌లో ఉంది. వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సెస్, ఓవర్ డ్రాఫ్ట్ రూపంలోనూ ఎక్కువ రోజులు రుణం తీసుకున్న రాష్ట్రం ఏపీనే. తక్షణ అవసరాల కోసం ఈ రుణం తీసుకుంది. గత ఏడాదిలో 305 రోజుల పాటు ఎస్డీఎఫ్, 283 రోజులు డబ్ల్యూఎంఏ, 146 రోజులు ఓవర్ డ్రాఫ్ట్ సౌకరాన్ని ఏపీ ప్రభుత్వం ఉపయోగించుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బిఐ నుంచి స్పెషల్ డ్రాయింగ్ ఫెసిలిటీ (ఎస్‌డిఎఫ్), వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సెస్, ఓవర్‌డ్రాఫ్ట్ రూపంలో అత్యధిక రోజులు తెలుగు రాష్ట్రాలు అప్పులు చేశాయని లెక్క తేలింది. ఇందులో ఆంధ్రప్రదేశ్ మొదటిస్థానంలో, తెలంగాణ రెండోస్థానంలో నిలబడ్డాయి. ఏపీ ప్రభుత్వం 2021-22 ఆర్థిక సంవత్సరంలో 305 రోజులపాటు స్పెషల్ డ్రాయింగ్ ఫెసిలిటీ, 283 రోజులు వేస్ అండ్ మీన్స్, 146 రోజులు ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యాన్ని ఉపయోగించుకుందని 'ఇన్వెస్ట్‌మేంట్ ఇన్ఫర్మేషన్ అండ్ క్రెడిట్ రేటింగ్ ఇండియా లిమిటెడ్' అనే సంస్థ తాజాగా విడుదల చేసిన డాటా ద్వారా వెల్లడైంది. దేశంలో మరే రాష్ట్రమూ ఇన్ని రోజులు చేబదుళ్ల సౌకర్యాన్ని ఉపయోగించలేదు. ఏపీ తర్వాత రెండో స్థానంలో తెలంగాణ ఉంది. మూడో స్థానంలో మణిపూర్ నిలిచింది. ఈ సౌకర్యాలు ఎంత ఎక్కువగా ఉపయోగించుకుంటే ఆ రాష్ట్ర పరిస్థితి అంత ఆందోళనకరంగా ఉన్నట్టు ఆర్థికవేత్తల అంచనా. గత ఆర్థిక సంవత్సరం మొత్తం 17రాష్ట్రాలు ఎస్‌డీఎఫ్, 14 రాష్ట్రాలు వేస్ అండ్ మీన్స్, 9 రాష్ట్రాలు ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యాన్ని వాడుకున్నాయి. అసోం, బీహార్, గుజరాత్, కర్నాటక, మధ్యప్రదేశ్, ఒడిశా, తమిళనాడు, ఉత్తరప్రదేశ్‌లు దేనినీ ఉపయోగించుకోలేదు. మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్ కేవలం ఒక్కరోజు మాత్రమే ఎస్‌డీఎఫ్ సౌకర్యాన్ని ఉపయోగించుకున్నాయి. మొత్తం మూడు రకాల రుణ సౌకర్యాలను ఆరు రాష్ట్రాలు వాడుకున్నాయి. కన్సాలిడేటెడ్ సింకింగ్ ఫండ్‌లో ఏటా పెట్టే వార్షిక పెట్టుబడుల ఆధారంగా స్పెషల్ డ్రాయింగ్ ఫెసిలిటీ కింద అప్పు తీసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఇలాంటి అప్పుపై రెపోరేటు కంటే 2శాతం తక్కువగా వడ్డీ వసూలు చేస్తారు. ఇదే సౌకర్యాన్ని గవర్నమెంటు సెక్యూరిటీ ఆధారంగా వాడుకుంటే 1శాతం మాత్రమే వడ్డీ విధిస్తారు. వేస్ అండ్ మీన్స్ కింద తీసుకునే అప్పు మూడు నెలల్లోపు కడితే రెపోరేటు ప్రకారం వడ్డీ వసూలు చేస్తారు. తిరిగి చెల్లించే సమయం అంతకు మించితే 1శాతం అదనంగా వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. ఈ రెండు సౌకర్యాలు పూర్తయిన తర్వాత కూడా ఆర్థిక అవసరాలు తీరకపోతే రాష్ట్ర ప్రభుత్వాలు ఓవర్‌డ్రాఫ్ట్‌కు వెళ్తాయి. వేస్ అండ్ మీన్స్ కింద అర్హత ఉన్న మొత్తానికి సమానంగా తీసుకుంటే రెపోరేటు 2శాతం, 100శాతానికి మించి తీసుకుంటే 5శాతం వడ్డీ వసూలు చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వాలకు వచ్చే ఆదాయం రోజువారీ అవసరాలకు సరిపోనప్పుడు ఇవి ఆర్‌బీఐ వద్ద స్వల్పకాలానికి ఈ మూడింటిలో ఏదైనా ఒక సౌకర్యం ద్వారా అప్పుచేస్తుంటాయి. ఎస్డీఎఫ్, వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సెస్, ఓవర్ డ్రాఫ్ట్ సౌకర్యాన్ని ఎంత ఎక్కువగా వాడితే.. ఆ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతగా దిగజారినట్లేనని ఆర్థిక నిపుణుల అంచనా. దీంతో తెలుగు రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిపై ఎకనమిస్టులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎస్ డీఎఫ్, వేస్ అండ్ మీన్స్ సౌకర్యాలు పూర్తయిన తర్వాత కూడా ఆర్థిక అవసరాలు తీరకపోతే రాష్ట్ర ప్రభుత్వాలు ఓవర్ డ్రాఫ్ట్ తీసుకుంటాయి. వేస్ అండ్ మీన్స్ కింద అర్హత ఉన్న మొత్తానికి సమానంగా తీసుకుంటే 2 శాతం, 100శాతానికి మించి తీసుకుంటే 5 శాతం వడ్డీ వసూలు చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వాలకు వచ్చే ఆధారం రోజువారీ అవసరాలకు సరిపోనప్పుడు ఇవి ఆర్బీఐ వద్ద స్వల్పకాలానికి ఈ మూడింటిలో ఏదైనా ఒక సౌకర్యం ద్వారా అప్పు చేస్తుంటాయి. అయితే, ఈ సౌకర్యాలను అత్యధిక రోజులు ఉపయోగించుకున్న రాష్ట్రాలు వడ్డీ రూపంలో ఆర్థికంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలు ఇదే పరిస్థితిలో ఉన్నాయని చెప్పవచ్చుఈ సౌకర్యాలను అత్యధిక రోజులు ఉపయోగించుకున్న రాష్ట్రాలు వడ్డీ రూపంలో ఆర్థికంగా నష్టపోవాల్సి ఉంటుంది.

# తిరుపతిలో జనసేన వర్సెస్ టీడీపీ

తిరుపతి, మే 25, ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతి. ఒకప్పుడు తెలుగుదేశానికి కంచుకోట. ఆ పార్టీకి ఎంతో సెంటిమెంటుతో కూడుకున్న నియోజకవర్గం తిరుపతి. టీడీపీ స్థాపించిన సమయంలో ఎన్టీఆర్ సైతం తిరుపతి నుంచి పోటిచేసి గెలిచారు. అంతగా పార్టీకి బలమైన క్యాడర్ వుంది తిరుపతిలో. గత ఎన్నికల్లో సైతం జిల్లాలో ప్రతి ఒక్క నియోజకవర్గంలో నలభైవేల మెజారిటీతో ఓటమి పాలైతే, ఇక్కడ మాత్రం కేవలం ఎనిమిది వందల ఓట్ల తేడాతో ఓడింది. 2014లోనూ, టిడిపి మంచి మెజారిటితోనే గెలిచింది. అలాంటి నియోజకవర్గాన్ని ఇప్పుడు జనసేన పార్టీ హైజాక్ చేస్తోందని టాక్ జోరుగా తిరుపతిలో సాగుతోంది. టిడిపి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ పనితీరుతో పాటు పార్టీలోని గ్రూపుల గోలతో అసలు నియోజక వర్గంలో పార్టీ ఉందా లేదా అన్న అనుమానం, సొంత పార్టీ నేతల్లోనే వ్యక్తం అవుతోంది. మరోవైపు జనసేన మాత్రం తిరుపతి టార్గెట్ గా వరుసగా నిరసనలు, ధర్నాల చేస్తోంది. టిడిపి చేస్తున్న కార్యక్రమాలు ఏంటో కూడా తెలియడం లేదన్నది లోకల్ గా హాట్ టాపిక్. కొన్ని రోజులుగా వైసిపిని తీవ్ర స్థాయిలో జనసేన టార్గెట్ చేస్తోంది. విద్యుత్,బస్ చార్జీల పెంపు నుంచి టిటిడిలోని లోపాలు ఎత్తి చూపుతోంది. రసిక రాజా ఇద్దరు మంత్రుల పేరుతో సినిమా తీస్తామని, రాష్ట్రానికి కొత్తగా వచ్చిన విషసర్పాలు అంటూ పోస్టర్ ను ఆవిష్కరించారు. తిరుపతి టీడీపీ కోల్డ్ వార్ పై అధిష్టానానికి ఫిర్యాదులు ,సెగ్మెంట్ ఇంచార్జ్‌తో పొసగక ఎవరిదారి వారిదే ఇన్ చార్జ్ ను మార్చాలని అధిష్ఠానాన్ని కోరారా? శ్రీనివాస్ పేరు ఇప్పుడు పార్టీలో జోరుగా,శ్రీనివాస్ ను ఇంచార్జ్‌గా నియమించాలని కోరుతున్నారా? జగన్ రెడ్డి పేరు జైలు రెడ్డి.. కేరాఫ్ చంచల్ గూడా అని, సీఎం ను ఇక నుంచి జైలు రెడ్డి అని పిలుస్తామని తీవ్రస్థాయిలో విరుచుపడుతోంది జనసేన. ఇంతలా జనసేన ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. టిడిపి నేతలు మాత్రం మాకెందుకులే అనే డైలాగ్ ను కేడర్ వద్ద వినిపిస్తున్నారట. మరికొందరు ఇక లాభం లేదని, చంద్రబాబు, లోకేష్ లకు ఫిర్యాదు చేశారట తెలుగు తమ్ముళ్ళు. ఏ పదవీ లేని జనసేన నేతలు, ప్రభుత్వంపై విరుచుకుపడుతుంటే, టిడిపిలో ఉన్ననాయకులు ఇన్ఛార్జితో పొసగలేక, ఎవరిదారిన వాళ్ళు వుండటం పార్టీకి మైనస్ గా మారింది. జాతీయ, రాష్ట్రస్థాయి కమిటీల్లో పదవులు దక్కించుకున్న నేతలు తిరుపతిలో ఏంచేస్తున్నారో అర్థంకావడం లేదని, కార్యకర్తలు రగిలిపోతున్నారట. ఇక గత కార్పొరేషన్ ఎన్నికల రేస్‌లో ప్రధాన ప్రతిపక్షంగా ఉండి కూడా, టీడీపీ చేతులెత్తేసింది. కనీసం సగం డివిజన్లలో కూడా పోటీ చేయలేని దయనీయ స్థితిలోకి పార్టీ కూరుకుపోవడంపై టిడిపి తీవ్రస్థాయిలో చర్చలు సాగాయి. అయినా మాజీ ఎమ్మెల్యేలో గాని, లోకల్ నేతల్లో మార్పురాలేదట. ఏదో చేశామంటే చేశామనేలా వ్యవహరించడం పార్టీ కేడర్‌కు రుచించడం లేదట. అలా రుచించని కొద్దిమంది నేతలు ఇన్ చార్జ్ ను మార్చాలని అధిష్ఠానాన్ని కోరినట్లు టాక్ నడుస్తోంది. బలిజసామాజిక వర్గానికి చెందిన జేబి శ్రీనివాస్ పేరు ఇప్పుడు పార్టీలో జోరుగా వినపడుతోందట. టిడిపి సైలెంట్ అవ్వడంతో తిరుపతిని హైజాక్ చెయ్యాలని గట్టిగానే ప్రయత్నాలు చేస్తోందట జనసేన. ఒకవేళ పొత్తు కుదిరితే తిరుపతి సీటు అడగాలనే ఆలోచన జనసేన వుందట. స్వయంగా పవన్ బరిలోకి దిగుతారన్న ప్రచారమూ జరుగుతోంది.

# గ్లేజ్ ఇండియాతో గ్రాండ్ గా మోసం

గుంటూరు, మే 25,మార్కెట్ రేటు కంటే తక్కువ ధరకే మాల్ ఇప్పిస్తామన్నారు. కొన్ని వస్తువులు అయితే మార్కెట్ రేటు కంటే నలభైశాతం తక్కువకే ఇస్తామని మాయమాటలు చెప్పారు. అందరినీ నమ్మించేందుకు రెండు మూడు నెలలు చెప్పినట్లే చేసి తర్వాత కోట్ల రూపాయలు వసూలు చేశారు. డబ్బులు ఇవ్వమంటే అడ్డం తిరగడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. గుంటూరు ఏటీ అగ్రహారానికి చెందిన పదుచూరి రమ్య, దిలీప్ లు గ్లేజ్ ట్రేడింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ పేరుతో మోసాలకు తెరతీశారు. తెలిసిన వారితో పెట్టుబడులు పెడితే భారీగా లాభాలు వస్తాయని నమ్మించారు. ఏ వస్తువైనా మార్కెట్ రేటు కంటే తక్కువ ధరకు వస్తుందని నమ్మించారు. నిత్యావసర వస్తువులు మార్కెట్ రేటు కంటే పది శాతం తక్కువ ధరకు ఇప్పిస్తామని చెప్పారు. బైకులు, హోం నీడ్స్ అయితే మరింత తక్కువ ధరకు వస్తాయని చెప్పారు. తెలిసినవాళ్లు కావడంతో ఇద్దరి మాటలు నమ్మారు. మొదట రెండు, మూడు సార్లు చెప్పినట్లే తక్కువ ధరకు వస్తువులు అందించారు. దీంతో వారిపై అందరికీ నమ్మకం కుదిరింది. కంపెనీలో పెట్టుబడులు పెడితే మరింత లాభం వస్తుందని నమ్మించారు. లాభంతో పనిలేదనుకుంటే పదిరూపాయల వడ్డీ ఇస్తామని చెప్పారు. లాభాలు భారీగా వస్తాయని అందరూ ఆశపడ్డారు. ఇలా దాదాపు 50మంది రెండున్నర కోట్లు చెల్లించారు. తర్వాత సరుకు డెలివరీ చెయ్యకపోవడమే కాకుండా డబ్బులు అడిగితే మొహం చాటేశారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చెయ్యడంతో దిలీప్ తండ్రి తాను పదిహేను రోజుల్లో డబ్బులు చెల్లిస్తామని చెప్పాడని బాధితులు చెబుతున్నారు. పదిహేను రోజులు గడిచిన తర్వాత డబ్బులు ఇచ్చేది లేదని, మీకు చైతనైది చేసుకోండంటూ బెదిరిస్తున్నాడని బాధితులు వాపోతున్నారు. తాను నాలుగు లక్షలు ఇచ్చానని, తిరిగి డబ్బులు అడుగుతుంటే పట్టించుకోవడం లేదంటున్నాడు. కిరణా వ్యాపారి అనిల్ కుమార్ అయితే 27లక్షలు కట్టి మోసపోయాడు. నిత్యావసర సరుకులు మార్కెట్ రేటు కంటే తక్కువకు ఇస్తానంటే తాను నమ్మానని చెబుతున్నాడు. మొదట్లో తక్కువ ధరకే సరుకులు ఇవ్వడంతో తాను అప్పులు తీసుకొచ్చి 27లక్షలు చెల్లించానని చెబుతున్నాడు. ఇప్పుడు సరుకులు ఇవ్వలేదని, డబ్బులు అడిగితే పట్టించుకోవడం లేదని వాపోతున్నాడు. భారీగా ఆదాయం వస్తుందని బంగారం తాకట్టుపెట్టి పదిన్నర లక్షలు ఇస్తే తనను మోసం చేశారని మరో బాధితురాలు ఆవేదన వ్యక్తం చేస్తుంది. చిన్నప్పటినుంచి తెలిసినవారు కావడంతో నమ్మి డబ్బులు ఇచ్చామని, ఇలా మోసం చేస్తారని అనుకోలేదంటున్నారు. మార్కెట్ కంటే తక్కువ ధరకే వస్తువులు, సరుకులు ఇప్పిస్తానంటూ మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# అధికారపార్టీలో గ్రూపులు

ఒంగోలు, మే 25,ప్రకాశం జిల్లా గిద్దలూరు వైసీపీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, 2009 ముందు వరకూ సివిల్ కాంట్రాక్టరుగా ఉన్న అన్నా రాంబాబు, ప్రజారాజ్యం పార్టీలో చేరి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తర్వాత ఆ పార్టీ కాంగ్రెస్ లో విలీనం కావటంతో, కాంగ్రెస్ లో కొన్నాళ్లు కొనసాగారు. ఆ తర్వాత కాంగ్రెస్ ను వీడి తెలుగుదేశం పార్టీలో చేరి, 2014 ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత అనూహ్య పరిణామాలతో, బహిరంగంగా ఆ పార్టీ కండువాను తీసి పక్కన పడేసి వైసీపీలో చేరారు. 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్ జగన్ తర్వాత అత్యధిక మెజారిటీతో వైసీపీ నుంచి గెలిచారు. గెలిచే వరకూ అంతా బాగానే ఉన్నా, ఆ తర్వాత కార్యకర్తలతో కొంత గ్యాప్ వచ్చిందట.ఆ గ్యాప్ అలాగే పెరుగుతూ నియోజకవర్గంలోని, ఆరు మండలాల్లో అధికార పార్టీలో రెండు గ్రూపులుగా కార్యకర్తలు విడిపోయారట. ఎమ్మెల్యే వైఖరి నచ్చక కొందరు గ్రామపార్టీ కార్యకర్తలు పార్టీని వీడుతున్నారటఇటీవల గిద్దలూరు నియోజకవర్గ వైసీపీలో అసమ్మతి సెగలు మరింత ఎక్కువయ్యాయట. నెల రోజుల్లో రెండుసార్లు వైసీపీ అసంతృప్త నేతలు సమావేశమయ్యారట. ఎమ్మెల్యే అన్నా వ్యవహారంపై ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు సజ్జలతో పాటు వైసీపీ రీజనల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డిలను కలిసి ఫిర్యాదు చేయాలని నిర్ణయించుకున్నారట. అప్పటికీ వారు స్పందించకపోతే, అమీతుమీ తేల్చుకునేందుకు సిద్దమయ్యారట.ఈనెల 1వ తేదీన రాచర్ల మండల పరిధిలోని ఒక తోటలో ఎమ్మెల్యేపై అసంతృప్తితో ఉన్న పలువురు నేతలు తొలిసారి ప్రత్యేక సమావేశం నిర్వహించారట. గిద్దలూరు జడ్పీటీసీ బుడతా మధుసూదన్ యాదవ్‌తో పాటు గిద్దలూరు, రాచర్ల మండలాల్లోని కొందరు వైసీపీ కీలక నాయకులు ఆ సమావేశానికి హాజరయ్యారట. తాజాగా మరోసారి అసమ్మతి నేతలు భేటీ అయ్యారట. గిద్దలూరు, రాచర్ల మండలాలతోపాటు కొమరోలు మండలానికి చెందిన వైసీపీ నాయకులు, కిందిస్థాయి ప్రజా ప్రతినిధులు హాజరయ్యారట. తొలిసారి సమావేశం కంటే రెండవ సారి సమావేశానికి రెట్టింపు సంఖ్యలో అసంతృప్త నేతలు హాజరు కావటం చర్చనీయాంశంగా మారిందట. రెండవసారి సమావేశంలో జడ్పీటీసీ బుడతా మధుసూదన్ యాదవ్, మాజీ ఎంపీపీ శ్రీనివాసులు, గిద్దలూరు, రాచర్ల, కొమరోలు మండలాలకు చెందిన పలువురు ముఖ్యనేతలూ అటెండయ్యారు. గతంలో కూడా ఎమ్మెల్యే రాంబాబుకు వ్యతిరేకంగా కొందరు గుర్తుతెలియని వ్యక్తుల పేర్లతో పాంప్లెట్ల రూపంలో ప్రచారాలు చేశారట. ఒకటికి రెండు సార్లు అలా విడుదల చేయటంతో, ఎమ్మెల్యే అన్నా రాంబాబు మనస్తాపానికి గురయ్యారట.

అయినప్పటికీ ఆయన ఆశించిన స్థాయిలో ద్వితీయ శ్రేణి నేతలు ఆయనకు మద్దుతునివ్వలేదట. కనీసస్థాయిలో ఖండన కూడా ఇవ్వలేదట? ఆ విషయం తనను ఎంతో బాధించిందని అప్పట్లో రాంబాబు స్వయంగా తన అనుచరుల వద్ద ప్రస్తావించారట కూడా. వీటికి తోడు సీఎం సామాజిక వర్గ నేతలకు, ఏ చిన్న అవసరం వచ్చినా, అటు మంత్రి బాలినేని దగ్గరకో, ఇటు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దగ్గరకో వెళ్లి తమ పనులు చక్కబెట్టుకుంటున్నారు తప్ప, ఎమ్మెల్యే వద్దకు వెళ్లే పరిస్థితి లేదట. మరోవైపు ఎమ్మెల్యే వైఖరి నచ్చకునో, ప్రభుత్వంపై అసమ్మతితోనో, తెలుగుదేశం పార్టీ వైపు వలసలు కూడా గణనీయంగా పెరుగుతూ వస్తున్నాయి. నియోజకవర్గంలో తన రాజకీయ భవితవ్యానికి బీటలు వారుతున్నాయని ఎమ్మెల్యే రాంబాబు అర్దం చేసుకున్నారా? లేదా రోజురోజుకు పెరుగుతున్న పార్టీ అసంతృప్తులను ఎమ్మెల్యే ఎలా బుజ్జగిస్తారు? పార్టీ పెద్దలు సజ్జల, బాలినేనిని కలవనున్న నాయకులు, అన్నాపై ఎలాంటి ఫిర్యాదులు చేస్తారు? అధిష్టానం వారిని ఏం మంత్రం వేసి శాంతింప జేస్తుంది? అన్నాతో కలిసి వారు నియోజకవర్గంలో కలసి అడుగులు ముందుకు వేసే పరిస్థితి వుందా? కాలమే సమాధానం చెప్పాలి.

### అంబేద్కర్ పేరు పై జిల్లాను వ్యతిరేకించడం అనైతికం....

#### దళిత ప్రజాసంఘాల ఐక్యవేదిక

బద్వేలు రాష్ట్ర ప్రభుత్వం కోనసీమ ను డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జిల్లాగా ప్రకటిస్తే దానిని అగ్రవర్ణ పెత్తందార్లు వ్యతిరేకించడం అనైతికమని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు పడిగె వెంకటరమణ, పూలే అంబేద్కర్ రాజ్యాధికారం సమితి తాలూకా కన్వీనర్ పిచ్చయ్య పేర్కొన్నారు. ఈరోజు ఉదయం బద్వేలు పట్టణంలోని అంబేద్కర్ గారి విగ్రహం దగ్గర బద్వేల్ దళిత ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కోనసీమ ను అంబేద్కర్ జిల్లాగా ప్రకటిస్తే దానిని వ్యతిరేకించే వాళ్లకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు నారాయణ, దళిత నాయకులు జకరయ్య, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరమణ ,పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి తాలూకా కన్వీనర్ పిచ్చయ్య, మాల మహానాడు నాయకులు రవి, వెంకటేష్, సీనియర్ దళిత నాయకులు కూకట్పల్లి మురళి, డి బిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిన్నయ్య, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మునయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దళిత ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ తూ ప్రపంచ మేధావి అయిన బి.ఆర్ అంబేద్కర్ గారి పేరును జిల్లాగా ప్రకటిస్తే దానిని వ్యతిరేకించి మంత్రి ఇంటి పై దాడి దాడి చేయడం అప్రజాస్వామికమని కులోన్మదు లైన ఇలాంటి వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని, ఎన్టీఆర్ పేరు, అల్లూరి సీతారామరాజు పేరు, సాయిబాబా పేరు ,రాజశేఖర్ రెడ్డి పేరు మీద జిల్లాలను ప్రకటించిన వ్యతిరేకించని వాళ్లు అంబేద్కర్ గారి పేరు పైన జిల్లాను ప్రకటిస్తే వ్యతిరేకించడం కుల వివక్ష అని ఇలాంటి వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వలసిన అవసరం ఎంతైనా ఉందని వారన్నారు.

# ఉందిగా జాగా...వేసేయ్ పాగా

## అనంతలో భూ కబ్జాల పర్వం

అనంతపురం, మే 25, ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జానే. అనంతలో భూఆక్రమణదారుల ఆగడాలకు హద్దే లేకుండా పోతోంది. ప్రభుత్వ భూములా.. అసైన్డ్ భూములా అన్న తేడాలు ఏమీ లేవు.. కనిపిస్తే కబ్జా చేసేస్తామన్న ధోరణిలో ముందుకెళుతున్నారు. అయితే వీరి దాహం మరింత వికృత రూపం దాల్చి ఏకంగా కలెక్టర్ సంతకాన్నే ఫోర్జరీ ఎన్‌ఓసీ తెచ్చుకున్నారంటే పరిస్థితి ఏ రేంజ్ లో ఉందో అర్థం చేసుకోవచ్చు. తాజాగా వెలుగులో చూసిన కలెక్టర్ సంతకం ఫోర్జరీ సంతకం వ్యవహారం కలకలం రేపుతోంది. అనంతపురం జిల్లాలో భూ మాయగాళ్లు రోజు రోజుకీ పేట్రేగిపోతున్నారు. ఇటీవల ఎక్కడ చూసినా భూముల ధరలకు రెక్కలు రావడంతో వారు అడ్డూ అదుపు లేకుండా భూముల విషయంలో అక్రమాలకు పాల్పడుతున్నారు. పాత కాలంలో అయితే దౌర్జన్యం చేసి భూములు కబ్జా చేసే వారు. ఇప్పుడు ట్రెండ్ మార్చి.. అక్రమ కొనుగోళ్లను సక్రమం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఎక్కడ ఖాళీ జాగా కనిపిస్తే చాలు.. అక్కడ జెండా పాతేస్తున్నారు. దానికి సంబంధించి నకిలీ పత్రాలు సృష్టించి.. లీగల్ చేస్తున్నారు. తాజాగా ఇలాంటి వ్యవహారం జిల్లాలో కలకలం రేపుతోంది. ఏకంగా భూ మాయగాళ్లు బరి తెగించి.. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ల సంతకాలనే ఫోర్జరీ చేశారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటనపై ప్రస్తుతం విచారణ జరుగుతోంది. ఇంతకీ ఎక్కడుంది.. ఆ భూమి.. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సంతకాలను ఎందుకు ఫోర్జరీ చేశారు?కూడేరు మండలం కమ్మూరు గ్రామ సర్వే నంబర్ 525, 526లో బోయ నారాయణప్ప పేరిట 34.86 ఎకరాల పొలముంది. దీనికి 1954వ సంవత్సరంలోనే డి.పట్టా మంజూరైంది. చెరువుకు ఆనుకుని ఉన్న ఈ భూమిలో నిత్యం ఊటనీరు ఊరుతోంది. ఈ మొత్తం గతంలో కొందరు పేదలకు అసైన్డ్ చేసి ఇచ్చారు. అనంతపురం నగరానికి సమీపంలో ఉండటం.. దీనికి తోడు.. రహదారికి ఆనుకుని ఉండటంతో రియల్‌ఎస్టేట్ వ్యాపారుల కన్ను పడింది. అందుకే సదరు రైతు నుంచి తక్కువ ధరకు ఈ భూమిని కొనుగోలు చేశారు. ఇక ఎన్‌ఓసీ కోసం తమ వేట సాగించారు. ఎన్‌ఓసీ కోసం దరఖాస్తు చేసుకున్న తక్కువ టైంలోనే తహసీల్దార్, ఆర్డీఓ సంతకాలు పూర్తయ్యాయి. జేసీ, కలెక్టర్ సంతకాలు చేయాల్సి ఉంది. కానీ అంతలోనే సదరు వ్యక్తి ఓ రెవెన్యూ కార్యాలయంలో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్‌ను ఆశ్రయించి పని త్వరగా పూర్తయ్యేలా చూడాలని కోరాడు. దీంతో కంప్యూటర్ ఆపరేటర్ కలెక్టర్, జేసీ సంతకాలతో ఎన్‌ఓసీని అందజేశాడు. అయితే ఈ విషయం ఎలా తెలిసిందో ఏమో కానీ.. అంత తక్కువ టైంలో అందునా జేసీ, కలెక్టర్ సంతకాలు పూర్తి చేసుకుని రావడంపై అనుమానాలు వచ్చాయి. లోతుగా ఆరా తీయడంతో ఫోర్జరీ సంతకాలుగా తేలింది. దీంతో కలెక్టర్ సీరియస్ అయ్యారు. మొత్తం వ్యవహారం వెనుక ఎవరున్నారో తేల్చాలంటూ ఆదేశాలిచ్చారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ వ్యవహారంలో కూడేరు నుంచి కలెక్టరేట్ వరకు అంతా రెవెన్యూ సిబ్బందే ఉన్నట్టు తెలుస్తోంది. కూడేరు మండలం రెవెన్యూ ఉద్యోగులు, ఆర్డీవో కార్యాలయంలోని ఓ అధికారి సహకరించినట్లు తెలుస్తోంది. మరో వైపు పుట్లూరు మండలంలో కూడా 216 ఎకరాలకు భూమి లేకుండా పాసుపుస్తకాలు సృష్టించారు. దీనిపై విచారణ చేపట్టిన అధికారులు 175 ఎకరాలకు సంబంధించిన సర్వే నెంబర్లను ఆన్లైన్ లో తొలగించేందుకు రంగం సిద్ధం చేశారుమరో 41 ఎకరాల పై విచారణ చేయాల్సి ఉందని ఆర్డీవో తెలిపారు. మండల పరిధిలోని అరకటవేములలో 15 ఎకరాలు, కుమ్మనమలలో 50 ఎకరాలు, చింతకుంట లో 22 ఎకరాలు, చింతలపల్లి లో 20 ఎకరాలు, పుట్లూరు మండల కేంద్రం పరిధిలో 67 ఎకరాల సంబంధించిన సర్వే నెంబర్లను తొలగించారు. ఈ భూ కుంభ కోణానికి పాల్పడిన అధికారుల పై నివేదికను ఉన్నతాధికారులకు పంపారు. ఇప్పటికే పుట్లూరు మండలంలో జరిగిన భూ కుంభకోణంపై విచారణ జరిపిన ఆర్డీవో కూడేరులో జరిగిన నకిలీ ఎన్వోసీ ల భాగోతం పై కూడా పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు. అయితే మండలంలో నాయకుల ప్రమేయం లేకుండా ఇది జరగదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మొత్తం మీద కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సంతకాలను కూడా ఫోర్జరీ చేయడం జిల్లాలో కలకలం సృష్టిస్తోంది.

# సమ్మర్ లో పోటెత్తున్న పెన్నా

అనంతపురం, మే 25, కర్ణాటక రాష్ట్రం చిక్కబళ్లాపూర్ జిల్లా నంది హిల్స్‌లో పుట్టే పెన్నా నది కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లో ప్రవహిస్తుంది. 597 కిలోమీటర్లు ప్రవహించే ఈ నది ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు వద్ద తీరంలో బంగాళాఖాతంలో కలుస్తుంది. శ్రీసత్యసాయి జిల్లాలోకి హిందూపురం మండలం చౌళూరు వద్ద ప్రవేశిస్తుంది. అక్కడి నుంచి పలు గ్రామాల మీదుగా కోనాపురం వద్ద పరిగి మండలంలో ప్రవేశించి శ్రీరంగరాజుపల్లి సమీపాన పెన్నానదికి ఉపనది అయిన కుముద్వతి నదితో కలిసి పెన్నా?కుముద్వతి ప్రాజెక్టుకు నీరు చేరుతుంది. అక్కడి నుంచి రొద్దం మీదుగా కర్ణాటక రాష్ట్రం నాగలమడక ప్రాజెక్టుకు చేరి.. అలా మరోసారి ఆంధ్రాలో కలిసి కనగానపల్లి మీదుగా రామగిరి వద్ద అప్పర్ పెన్నార్ ప్రాజెక్టు (పేరూరు డ్యామ్)లోకి కలుస్తుంది. దాదాపు 75 కిలోమీటర్ల మేర పెన్నానది ఈ జిల్లాలో ప్రవహిస్తుంది. మూడు రోజులుగా కురిసిన వర్షాలకు పెన్నా పారుతోంది. హిందూపురం మండలం చౌళూరు, సంతేబిదనూరు, కిరికెర, బేవినహళ్లి, సుగూరు చెరువులు, పెన్నా?కుముద్వతి ప్రాజెక్టులో కలిసిన తర్వాత లెఫ్ట్ కెనాల్ ద్వారా పరిగి మండలం పరిగి, శాసనకోట, సుబ్బరాయునిపల్లి, కొడిగెనహళ్లి చెరువులు, రైట్ కెనాల్ ద్వారా కొట్నూరు, కొల్లకుంట, ఊటుకూరు చెరువులకు నీరు చేరుతోంది. పరిగి మండలం పైడేటి నుంచి రొద్దం మండలంలోకి ప్రవేశిస్తోంది.జిల్లాలో 18,418 ఎకరాల ఆయకట్టుకు లబ్ధి చేకూరుతోంది. మూడు దశాబ్దాల కిందట (1991 ఏప్రిల్‌లో) కర్ణాటకలో కురిసిన వర్షాలకు చాలా చెరువులు తెగి పెన్నా, ఉపనది జయమంగళి ఉధృతంగా ప్రవహించాయి. ఆంధ్ర ప్రాంతంలో వర్షాలు తక్కువైనప్పటికీ మన ప్రాంతంలో నదులు పారి చెరువులు నిండి మరువలు పారాయి. మళ్లీ ఇప్పుడు మండు వేసవిలో చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో నదులు పరవళ్లు తొక్కుతుంటే జిల్లా ప్రజలు ఆశ్చర్యంలో మునిగిపోయారు. దీనికి తోడు ఏడు నెలల వ్యవధిలోనే పెన్నా నది రెండు సార్లు పారింది. ఇదో అద్భుతంగా అభివర్ణిస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నీటికి కటకటలాడే పరిస్థితుల నుంచి చెరువులు నిండి, భూగర్భజలాలు సైతం మెరుగుపడి బోర్లు రీచార్జ్ అయ్యాయి. పెన్నా నది ఏడు నెలల్లో రెండు సార్లు పారడం పరీవాహక ప్రాంత ఆయకట్టు రైతులకు శుభ పరిణామం.

# మందకొడిగా కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్లు

కాకినాడ, మే 25,తులకు నష్ట పోనివ్వభోమని, ప్రభుత్వమే ధాన్యం కొనుగోళు చేస్తుందని అధికారులు చెప్పడమే గానీ ఆచరణలో పెట్టలేకపోతున్నారు. దళారులకు తక్కువ ధరకు ధాన్యం విక్రయించక్కర్లేదని, ప్రభుత్వ మద్దతు ధరతో కళ్లాల్లోనే నేరుగా ధాన్యం కొనుగోళ్లు అయ్యేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. అలాగే నెల రోజులుగా రబీ ధాన్యం కొనుగోళ్లు మొదలు పెట్టారు. కానీ 20 శాతం కూడా కొనుగోళ్లు చేయలేదు. అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. చేసేది లేక దళారులకే ధాన్యాన్ని విక్రయిస్తున్నారు.కాకినాడ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 5.48 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా నెల రోజులు దాటుతున్నా ఇప్పటివరకూ 90 వేల టన్నులు అంటే 16.42 శాతం మాత్రమే కొనుగోలు చేశారు. వాటికి సంబంధించిన డబ్బులు నేటికీ రైతులకు చెల్లించలేదు. కొనుగోళ్లలో తేమశాతం నిబంధన అడ్డంకిగా మారడంతో చివరకు రైతులు దళారులకే ధాన్యాన్ని అమ్ముకోవాల్సిన పరిస్థితి వస్తోంది.జిల్లా వ్యాప్తంగా రబీ సీజన్లో 1.86 ఎకరాల్లో వరి సాగైంది. 6,69,679 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. 1,00,452 మెట్రిక్ టన్నులు స్థానిక అవసరాలకు పోగా 5,48,498 మెట్రిక్ టన్నులు సేకరించాలని జిల్లా అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇందుకు 326 సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ప్రకారం ఎ-గ్రేడ్ రకం క్వింటాలుకు రూ.1,960 కాగా, 75 కిలోలకు రూ.1470, సాధారణ రకం క్వింటాలుకు రూ.1940 కాగా 75 కిలోలకు రూ.1450గా నిర్ణయించారు. గతనెల 11న కొనుగోళ్లను ప్రారంభించారు.కొనుగోళ్లలో తరచూ క్షేత్ర స్థాయిలో అనేక సమస్యలు ఏర్పడుతున్నాయి. 17 శాతం మించి తేమ శాతం ఉండరాదనే నిబంధనతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల అసని తుపాను ప్రభావంతో జిల్లాలో తుని, ప్రత్తిపాడు, పిఠాపురం, గొల్లప్రోలు, కరప, కాకినాడ రూరల్, జగ్గంపేట, కిర్లంపూడి, పెద్దాపురం, సామర్లకోట తదితర మండలాల్లో ధాన్యం తడిసిపోయింది. తేమ శాతాన్ని తగ్గించేందుకు రైతులు నానా పాట్లు పడుతున్నారు. ఐదారు రోజులుగా రహదారుల వెంబడి ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. ఇటువంటి ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని తాళ్లరేవుకు చెందిన దంగేటి కష్ణ అనే కౌలు రైతు తెలిపారు. ధాన్యాన్ని అమ్ముకునేందుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆలస్యం కావడంతో సచివాలయాలు, ఆర్బికె వెంబడి తిరిగే ఓపిక లేక చాలా మంది రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు.ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లో రైతుల ఖాతాలకు సొమ్మును జమేయాల్సి ఉంది. ఈ నెల రోజుల్లో 8,269 మంది రైతుల నుంచి సుమారు 90 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినా నేటికీ ఒక్క రైతుకీ పైసా కూడా జమచేయలేదు. దీనిపై పౌర సరఫరాల శాఖ అధికారులను వివరణ కోరగా 21 రోజులు పూర్తవ్వలేదని నిబంధనల ప్రకారం చెల్లింపులు చేస్తామని బదులిచ్చారు.

# పీకల్లోతు కష్టాల్లో అంగన్వాడీలు

నెల్లూరు, మే 25, రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ హెల్పర్లు 'జీతాలివ్వండి మహాప్రభో' అంటూ వేడుకుంటున్నా ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తోంది. రెవెన్యూ కార్యాలయాల వద్ద ధర్నాలు చేసినా, పదేపదే వినతిపత్రాలు అందజేసి మొరపెట్టుకున్నా..సంబంధిత శాఖాధికారుల్లో చలనం రావడం లేదు. మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో అంగన్వాడీలు తీవ్రమైన ఆర్థిక చిక్కుల్లో కూరుకుపోతున్నారు. ధరలు పెరిగిన నేపథ్యంలో మరింతగా అవస్థలు ఎదుర్కొంటున్నారు. వేతనాల జాప్యానికి కారణమేటనేది ఇప్పటికీ స్త్రీ,శిశు సంక్షేమశాఖ అధికారులు నిర్దిష్టంగా చెప్పకపోవడంతో అంగన్వాడీలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అయితే ఇటీవల ధర్నాలు చేపట్టడంతో కడప, కర్నూలు, నెల్లూరు, చిత్తూరు వంటి జిల్లాల్లో ఒక్క నెల వేతనం వేసినట్లు తెలిసింది.రాష్ట్రవ్యాప్తంగా 48,700 అంగన్వాడీ సెంటర్లు ఉన్నాయి. వీటిలో ఒక్కో వర్కర్, హెల్పర్ చొప్పున 97,400 మంది ఉన్నారు. మరో 5,600 మినీ అంగన్వాడీ సెంటర్లు ఉన్నాయి. వీటిలో మినీ వర్కర్లు ఉంటారు. రాష్ట్రవ్యాప్తంగా 1,03,000 మంది అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు పనిచేస్తున్నారు. అంగన్వాడీ వర్కర్కి నెలకు రూ.11,500, హెల్పర్కు రూ.7,000, మినీ వర్కర్కు రూ.7,000 చొప్పున ప్రభుత్వం వేతనాలు ఇస్తోంది. వీటి ప్రకారం చూస్తే ఈ నెల 20కి అంగన్వాడీల వేతన బకాయి రూ.282.04 కోట్లకు చేరింది.అద్దె భవనాల్లో కొనసాగిస్తున్న అంగన్వాడీ సెంటర్లకు గత 5 నెలలుగా ప్రభుత్వం నుండి అందాల్సిన అద్దె డబ్బులు కూడా నిలిచిపోయాయి. రాష్ట్రంలో దాదాపు 34 వేల అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. వీటికి స్త్రీ, శిశు సంక్షేమశాఖ గ్రామీణ ప్రాంతంలో నెలకు రూ.1,000, మున్సిపాలిటీ సెంటర్లకు రూ.4 వేలు, కార్పొరేషన్ పరిధిలోని సెంటర్లకు రూ.5 వేలు చొప్పున అద్దె చెల్లిస్తోంది. దీంతో భవన యజమానులు అద్దె కోసం అంగన్వాడీ వర్కర్లను, హెల్పర్లను నిలదీస్తుండటంతో మానసిక వేదనకు గురౌతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధ్ధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వేతనాలను, అద్దెలను సకాలంలో చెల్లించాలని అంగన్డీలు కోరుతున్నారు

# ఇసుక రీచ్ అనుమతులు రద్దు చేయాలి

చిత్తూరు చంద్రగిరి మండలం, పాతశానంబట్లలో గ్రామస్తుల ఆందోళన కొనసాగుతోంది. ప్రాణాలు పోయినా ఇసుక రీచ్ ను అడ్డుకుంటామని హెచ్చరించారు. వరదలు కారణంగా స్వర్ణముఖి నది గ్రామ సమీపం వరకు విస్తరించింది. ఈ ప్రాంతంలో రీచ్ కు అనుమతులు ఇస్తే గ్రామం కనుమరుగవుతుందని వారంటున్నారు. స్వర్ణముఖి ఆనుకుని విద్యుత్ సబ్ స్టేషన్, ప్రభుత్వ పాఠశాల, సచివాల భవనాలు ఉన్నాయి. ఒక్క అడుగు ఇసుక తవ్వినా మొదట ప్రభుత్వ కార్యాలయాలు కూలిపోతాయి. ఇసుక రీచ్ అనుమతులను రద్దు చేయాలని గ్రామస్తులు అంటున్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

చిత్తూరు తిరుపతి వైపు వెళుతున్న పంజాబ్ రాష్ట్రానికి చెందిన లారీ నగరి పట్టణంలోని హెచ్ పి పెట్రోల్ బంక్ వద్ద బైక్ పై వెళ్తున్న ఇద్దరు యువకులను ఢీ కొనడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మరణించారు.ప్రమాదం జరిగిన తర్వాత లారీ డ్రైవర్ వేగంగా లారీని ఆపకుండా వెళ్లడంతో.... బైక్ లారీ ముందు భాగంలో ఇరుక్కుపోయి కొంత దూరం ఈడ్చుకొని వెళ్లడం వలన మంటలు చెలరేగి లారీ లో భారీగా మంటలు చెలరేగాయి. గమనించిన లారీ డ్రైవర్ హైవే మార్గం మధ్యలో లారీ ఆపి పరారయ్యాడు. ప్రమాదంలో మరణించిన ఇద్దరు యువకుల వివరాలు తెలియాల్సి ఉంది..

# సీఎం వైఎస్ జగన్ చేపట్టిన సామాజిక విప్లవంతో ప్రజలందరు సంతోషం

**సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున**

అనంతపురం మే 25 రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన సామాజిక విప్లవంతో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు రాజకీయంగా పదవులను కట్టబెట్టి సమాజంలో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని కొనియాడారు.గత మూడేళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్న సామాజిక న్యాయాన్ని తెలియజేసేందుకు బస్సు యాత్ర చేపడుతున్నట్లు పేర్కొన్నారు. యాత్ర విజయవంతానికి చేపట్టాల్సిన ఏర్పాట్లపై మంత్రి ఉషశ్రీచరణ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు,ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డితో కలిసి ప్రజాప్రతినిధులతో మంగళవారం ఆయన స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల హక్కులను హరించి అణగారిన వర్గాలుగా చూసిన చరిత్ర గత పాలకులదైతే, అన్నింటా పెద్దపీట వేసి వారి ఆర్థిక, సామాజిక ఎదుగుదలకు దోహదపడిన వ్యక్తి జగనన్న అని కొనియాడారు. విద్యతోనే అభ్యున్నతి సాధ్యమని నమ్మి ఫీజు రీయింబర్స్మెంట్ అందించి సమాజంలో ఉన్నతంగా జీవించేలా ఉద్యోగావకాశాలు కల్పించారన్నారు. సీఎం జగన్ తీసుకొచ్చిన సామాజిక విప్లవం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని ఆయన పేర్కొన్నారు. మంత్రివర్గంలో 17 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు స్థానం కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్కే దక్కుతుందన్నారు. ఈ నెల 26 నుంచి 29 వరకూ శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు సాగే సామాజిక న్యాయ భేరి బస్సు యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బడుగు, బలహీన వర్గాల రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక ప్రతిపక్ష పార్టీల నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని మంత్రి నాగార్జున విమర్శించారు. బీసీలను అన్నింటా వంచించిన చంద్రబాబును కొన్ని మీడియా సంస్థలు, పెయిడ్ ఆర్టిస్టులు అట్టిపెట్టుకుని అభూతకల్పనలు సృష్టిస్తున్నాయని ధ్వజమెత్తారు. అధికారంలో ఉన్న సమయంలో టీడీపీ నేతలు ఎన్ని అరాచకాలు చేపట్టినా కళ్లులేని కబోధిలాగా ఉన్న చంద్రబాబు.. నేడు చిన్న ఘటనను కూడా పెద్దదిగా చూపించాలనుకోవడం ఆయన రెండునాల్కల ధోరణికి నిదర్శనమన్నారు.ఎస్సీ కులంలో ఎవరైనా పుడతారా అని హేళన చేసిన విషయాన్ని ఇంకా ఎవరూ మరువలేదన్నారు. కరోనా విజృంభించిన సమయంలో హైదరాబాద్ పారిపోయిన ఆయనను చూసి జనం నవ్వుకుంటున్నారన్నారు. ఓ ఎస్సీ అమ్మాయి మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్తుంటే లోకేష్ వస్తున్నాడంటూ ఆపి శవాల మీద పేలాలు ఏరుకున్నారని, వారిని నమ్మొద్దని పిలుపునిచ్చారు.

సామాజిక న్యాయ భేరి యాత్ర చరిత్రలో నిలిచిపోయే కార్యక్రమమని, ఎలాంటి అడ్డంకులు ఎదురైనా ముందుండి నడిపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ముస్లింల దోస్త్ సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి అని అభివర్ణించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను గత ప్రభుత్వాలు ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకున్నాయని, అయితే ప్రజలకు ఎంతో మేలు చేస్తున్న ప్రభుత్వం తమదని పేర్కొన్నారు. పప్పు నాయుడు, తుప్పునాయుడుల పార్టీకి 2024లో పాడె కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బీసీలకు ప్రత్యేకంగా రిజర్వేషన్ కల్పించి సమాజంలో గుర్తింపునిచ్చిందని తెలిపారు. 57 కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం విప్లవాత్మకమని పేర్కొన్నారు. రాష్ట్ర వక్ఫ్బోర్డు అధ్యక్షుడు ఖాదర్బాషా మాట్లాడుతూ మైనార్టీలకు మేయర్లుగా, చైర్మన్లుగా, డైరెక్టర్లుగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్కు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో శాసనమండలి విప్ వెన్నపూస గోపాల్రెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్రెడ్డి, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, జెడ్పీ చైర్పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ మొహమ్మద్ వసీం సలీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయ భాస్కర్రెడ్డి, వాసంతి సాహిత్య, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్, రాష్ట్ర పాఠశాల విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిటీ సీఈఓ ఆలూరు సాంబశివారెడ్డి, రాష్ట్ర నాటక అకాడమీ చైర్పర్సన్ హరిత, పార్టీ నాయకులు కాగజ్ఘర్ రిజ్వాన్, రమేష్గౌడ్, కృష్ణవేణి, రాధాయాదవ్, కుళ్లాయిస్వామి, శ్రీనివాసులు, అనిల్కుమార్ గౌడ్, కార్పొరేటర్లు, వైఎస్సార్సీపీ శ్రేణులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.బీసీ అంటే బ్యాక్వర్డ్ క్లాస్ కాదు, బ్యాక్బోన్ ఆఫ్ ది సొసైటీ, బెస్ట్ క్లాస్ ఆఫ్ ది సొసైటీ అని సీఎం వైఎస్ జగన్ నిరూపించారని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ తెలిపారు. ఎంతో ఉన్నత లక్ష్యంతో బడుగు, బలహీన వర్గాల వారికి పదవులను కట్టబెట్టిన ఘనత ముఖ్యమంత్రిదేనని కొనియాడారు. గత ప్రభుత్వంలో మైనార్టీ శాఖ మంత్రిగా పల్లె రఘునాథ రెడ్డిని నియమించారని, ముస్లిం వర్గానికి చెందిన ఒక్కరికి కూడా మంత్రి పదవి కేటాయించలేదని దుయ్యబట్టారు. సమష్టిగా సాగి సామాజిక న్యాయ భేరి కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు.

# కోనసీమలో కుట్ర రాజకీయం



కాకినాడ, మే 25, (న్యూస్ పల్స్)కోనసీమంటే కొబ్బరిచెట్లు.. పచ్చటి పంటపొలాలు.. సంక్రాంతొస్తే కోళ్లపందేలు, సరదాగా సాగే చతుర్ముఖోపారాయణాలు. అలాంటి ప్రశాంత గోదావరి సలసలా కాగుతోంది. మలమలా మాడుతోంది. రాజకీయం తలుచుకుంటే నీళ్లలోనూ నిప్పు పుట్టించగలదు. అమలాపురం అరాచకం దీన్ని కళ్లకు కడుతోంది. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ పేరుని జిల్లాకు పెడితే ఇంత నిరసన ఎందుకు? అందరి మెదళ్లనీ తొలిచేస్తున్న ప్రశ్న ఇది. ఎవరో నాయకుడు తన తండ్రిపేరో తాతపేరో పెడితే, వివాదాస్పద వ్యక్తులకు పెద్దపీట వేస్తే వ్యతిరేకత వస్తుంది. ఆగ్రహం పెల్లుబుకుతుంది. కానీ ఇప్పటికీ ఊరూవాడా నిలువెత్తు విగ్రహాలతో నివాళులు అందుకుంటున్న మహానుభావుడి పేరు పెడితే ఎందుకింత ప్రతిఘటన?అమలాపురం విధ్వంసం ప్రమాదకర పెడధోరణులకు సంకేతం. కులమతాల మధ్య, సంఘటితంగా బతుకుతున్న ప్రజలమధ్య చిచ్చురేపే దుష్టప్రయత్నం. అంగన్వాడీలు ధర్నాకు దిగితేనో, ఉద్యోగులు నిరసనకు దిగుతామంటేనో ముందస్తు అరెస్టులతో మోహరించే పోలీసులు చేతులెత్తేసే పరిస్థితి ఎందుకొచ్చిందన్నదే ప్రశ్న. మంత్రి ఇంటికే మూక నిప్పుపెట్టింది. మరో ఎమ్మెల్యే ఇంటిని నిలువెల్లా తగలెట్టింది. జిల్లా పాలనా కేంద్రం కూడా విధ్వంసకారులకు లక్ష్యంగా మారింది. మంట చల్లారకుండా చూసేందుకు రాజకీయం తనవంతు ఆజ్యంపోస్తోంది.మలాపురం విధ్వంసం టీడీపీ-జనసేన కుట్రంటోంది అధికారపక్షం. అందరి ఆమోదంతో తీసుకున్న నిర్ణయాన్ని ఇప్పుడు వ్యతిరేకిస్తున్నారన్నది వైసీపీ వెర్షన్. ఇక చీమ చిటుక్కుమన్నా రోడ్డెక్కుతున్న టీడీపీ.. వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేసింది. అమలాపురం విధ్వంసం అధికార పార్టీ స్పాన్సర్ చేసిందేనంటోంది. ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ మర్డర్ ఎపిసోడ్ని పక్కదోవ పట్టించేందుకే కోనసీమలో వైసీపీ అగ్గి రాజేసిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తీవ్ర ఆరోపణ చేశారు. అమలాపురం విధ్వంసం వెనుక పెద్ద కుట్రే ఉందని వైసీపీ చెబుతుంటే..పోలీసులు మాత్రం అప్పటికప్పుడు ఉద్రిక్తత చెలరేగిందంటున్నారు.దేశంలో స్వాతంత్ర్యానికి పూర్వంనుంచీ ఉన్న ఊళ్లపేర్లే మారిపోతున్నాయి. తరాలుగా ఉన్న కట్టడాల పేర్లు మార్చాలనే డిమాండ్లు తెరపైకి వస్తున్నాయి. మసీదు-మందిర్లాంటి సున్నిత వివాదాలు సెగలు పుట్టిస్తున్నాయి. మొన్నటిదాకా జిల్లాకేంద్రాల విషయంలో ఏపీలో జరిగిన రగడ సద్దుమణుగుతున్న సమయంలో అమలాపురం రాజుకుంది. నిప్పు ఎవరు అంటించారో తెలియకుండా పోదు. అగ్గిపెట్టడం సులువే. కార్చిచ్చును ఆర్పేయడమే కష్టం. ఎవరికోసమో పెట్టే మంటలో ఏదోరోజు మనం కూడా మాడిపోతామన్న నిజాన్ని ఎవరూ మరిచిపోకూడదు.

# హనుమజ్జయంతి నాడు ఆకట్టుకున్న ధార్మికోపన్యాసాలు, భక్తి సంగీతం

తిరుమల, హనుమజ్జయంతిని పురస్కరించుకుని బుధవారం తిరుమలలోని నాదనీరాజనం వేదిక, ఆకాశగంగ, జపాలి తీర్థంలో నిర్వహించిన ధార్మికోపన్యాసాలు, భక్తి సంగీతం ఆకట్టుకున్నాయి. నాదనీరాజనం వేదికపై మధ్యాహ్నం 3 నుండి 4 గంటల వరకు "అంజనానందనం వీరం" అనే అంశంపై జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఆచార్యులు ఆచార్య చక్రవర్తి రంగనాథన్ ఉపన్యసించారు. ఆకాశగంగలోని శ్రీ బాలాంజనేయస్వామివారి ఆలయం వద్ద బుధవారం ఉదయం 10 నుండి 11 గంటల వరకు జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం సహాయ ఆచార్యులు డా. పిటిజి.రంగాచార్యులు శ్రీ హనుమ అవతార ఘట్టంపై ఉపన్యసించారు. ఉదయం 11 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు జి.మధుసూదనరావు బృందం శ్రీ హనుమాన్ చాలీసా, శ్రీరామ, శ్రీ హనుమ సంకీర్తనలు ఆలపించారు. మధ్యాహ్నం 12 నుండి 1 గంట వరకు ఎస్వీ సంగీత, నృత్య కళాశాల అధ్యాపకురాలు డా. కొల్లూరు వందన పలు త్యాగరాజ కీర్తనలు, రామ కీర్తనలను హృద్యంగా ఆలపించారు. మధ్యాహ్నం 2 నుండి 3 గంటల వరకు శ్రీమతి వి.విజయకుమారి బృందం హరికథ వినిపించారు. మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 4 గంటల వరకు దాస సాహిత్య ప్రాజెక్టు కళాకారులు హనుమంతుని వైభవంపై దాస సంకీర్తనలు గానం చేశారు. ప్రోగ్రాం అసిస్టెంట్ శ్రీ పురుషోత్తం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. జపాలి శ్రీ ఆంజనేయస్వామివారి ఆలయం వద్ద ఉదయం 11 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు దాస సాహిత్య ప్రాజెక్టు కళాకారులు బెంగళూరుకు చెందిన సంధ్య శ్రీనాథ్ బృందం హనుమంతుని పరాక్రమం, దయాగుణం అంశాలపై భక్తి సంకీర్తనలు గానం చేశారు. మధ్యాహ్నం 2 నుండి 3 గంటల వరకు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు కె.ఉదయభాస్కర్ బృందం, మధ్యాహ్నం 3 నుండి 4 గంటల వరకు ఎస్వీ సంగీత, నృత్య కళాశాల అధ్యాపకురాలు డా. కొల్లూరు వందన బృందం పలు భక్తి సంకీర్తనలు ఆలపించారు.

# ప్లాన్ ప్రకారమే అమలాపురంలో కొన్ని శక్తులు విధ్వంసం

**ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి**

అమలాపురం మే 25 'ప్లాన్ ప్రకారమే అమలాపురంలో కొన్ని శక్తులు నిరసనకారుల్ని రెచ్చగొట్టి అమలాపురంలో విధ్వంసం సృష్టించాయని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. బుధవారం మంత్రి విశ్వరూప్ ఇంటిని పరిశీలించిన సజ్జల.. మీడియాతో మాట్లాడారు.'ప్లాన్ ప్రకారమే అమలాపురంలో విధ్వంసం సృష్టించారు. అంబేద్కర్ పేరు పెట్టాలని అన్ని వర్గాలు కోరాయి.ప్రధాన పార్టీలన్నీ మద్దతు పలికాయి. జిల్లాకు అంబేద్కర్ పేరు పెట్టాలని టీడీపీ అధినేత చంద్రబాబు డిమాండ్ చేశారు.కులాల మధ్య చిచ్చుపెట్టాలని విపక్షాలు కుట్ర పన్నాయి. కొన్ని శక్తులు నిరసనకారులను రెచ్చగొట్టాయి. ఈ తరహా శక్తుల్ని ఎలా హ్యాండిల్ చేయాలి ప్రభుత్వానికి తెలుసు.రాష్ట్ర ప్రభుత్వం సంయమనం పాటించడంతోనే ఈ కుట్రను అదుపులోకి తెచ్చాం' అని ఆయన తెలిపారు.

# రాష్ట్ర మహాసభలను .జయప్రదం చేయండి

ప్రొద్దుటూరు సిఐటియు రాష్ట్ర మహా సభలు జూన్ 1,2, తేదీలలో జరగనున్నాయని జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులరెడ్డి అన్నారు బుధవారం ప్రొద్దుటూరులో ని సిఐటియు కార్యాలయంలో జరిగిన విలేకరుల,సమావేశంలో ఆయన మాట్లాడారు నెల్లూరు పట్టణంలో జరుగు మహాసభలను జయప్రదం చేయాలన్నారు. మోటార్ వెహికల్ సవరణ చట్టం 2019 మన రాష్ట్రంలో అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం జిఓ నెం. 21ని తెచ్చిందన్నారు . అన్ని రకాల చలానాలను, ట్రాన్స్పోర్ట్ రెన్యువల్ చార్జీలను, ఈ-చలానాలు, ఫైన్లను విపరీతంగా పెంచారని ఆవేదన వ్యక్తంచేశారు ఫైనాన్సర్ల దాడులు , రవాణా అధికారుల వేధింపులు స్థానిక రీ ఫైనాన్స్ విషయాల పైన రాష్ట్ర మహాసభలలో చర్చించి ,తదితర స్థానికంగా వస్తున్న సమస్యలను జోడించి జూన్ నెలలో దీనిపై క్యాంపెయిన్ నిర్వహించి జూలై నెలలో "ఛలో విజయవాడ"కార్యక్రమం ఉంటుందన్నారు. అదేవిధంగా కేరళ, తమిళనాడు తరహా ఆటో, ట్రాన్స్పోర్ట్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చెయ్యాలనే అంశాన్ని కూడా విస్తృతంగా కార్మికుల్లో ప్రచారం చెయ్యాలన్నారు రాష్ట్ర మహాసభల్లో ప్రధానంగా. ఆటో కార్మికుల ఉపాధిని దెబ్బతీస్తున్న జిఓ నెం. 21ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు ఆర్.టి.ఓ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, ఈ-చలానాల పేరుతో వేసిన అక్రమ జరిమానాలను రద్దు చేయాలి.పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు నియంత్రించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించిన పన్నులను ఉపసంహరించుకోవాలి. పెరుగుతున్న ధరలను బట్టి దానికి అనుగుణంగా ఆటో చార్జీలను నిర్ణయించాలి.కేరళ, తమిళనాడు తరహ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు మున్సిపల్, ఆర్టిఓ, ట్రాఫిక్ పోలీసులు, ఆటో, ట్రాలీ సంఘాలతో ఎడ్వైజరీ కమిటీలు వేయాలన్నారు అధికారులు ఆటోసంఘాల సూచనలు పరిగణలోకి తీసుకొని నిర్ణయాలు చెయ్యాలన్నారు మోటార్ వెహికల్ సవరణ చట్టం - 2019కి వెనక్కి తీసుకోవాలన్నారురక్షించాలి ట్రాన్స్ పోర్టు రంగానికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు .ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె సత్యనారాయణ , పట్టణ కార్యదర్శి బి.విజయకుమార్, వై. చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు

# అంబేద్కర్ విగ్రహానికి పాలభిషేకం

విజయవాడ కోనసీమ లో అల్లర్లు జరుగుతున్న నేపథ్యంలో జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన మహేష్ అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కోనసీమలోని అల్లర్లు జరగడానికి ముఖ్యమైన కారణం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన నాయకులని తెలిపారు. గతంలో జరిగిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అనంత బాబు చేసిన హత్య కేసు నుండి ప్రజల దృష్టి మరల్చడానికి కోనసీమలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన నాయకులు కార్యకర్తలు పనిగట్టుకుని మరీ ఘర్షణలు చేస్తున్నారనీ చెప్పేసి ఈ సందర్భంగా దుయ్యబట్టారు. వైసిపి కులాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తుందని తెలిపారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన నాయకులు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పై ఆవాకులు చవాకులు పేలితే రాష్ట్ర వ్యాప్తంగా పవన్ కళ్యాణ్ అభిమానులు ఎదురు తిరుగుతారు ఈ సందర్భంగా హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇంత పటిష్టంగా ఉన్న పోలీసు వ్యవస్థ అల్లర్లను అదుపు చేయలేక పోవడం దేనికి నిదర్శనం అని ప్రశ్నించారు. ప్రభుత్వం కోనసీమ ప్రాంతం మొత్తం తమ ఆధీనంలోనే ఉందని అక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగడం లేదని ప్రజలను తప్పు దోవ పట్టిస్తుందని తెలిపారు.

# మంథని లో ఘనంగా హనుమాన్ పెద్ద జయంతి

మంథని వైశాఖ బహుళ దశమి సందర్భంగా నిర్వహించు హనుమాన్ పెద్ద జయంతి వేడుకలను మంథని పట్టణంలోని పలు హనుమాన్ ఆలయాల్లో భక్తులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. పలు ఆ లయాల్లోని హనుమాన్ విగ్రహాలకు చంద్రం వేసి, ప్రత్యేక అభిషేకాలు చేసి, నైవేద్యాలు సమర్పించి పూల మాలలు, తమలపాకులతో తయారుచేసిన దండలను వేసి నూతన వస్త్రాలను అలంకరించి తమ భక్తిని చాటుకున్నారు భక్తులు. హనుమాన్ జయంతి సందర్భంగా మల్హార్ మండలం కొయ్యూరు గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో మంథని ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్ బాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా మంథని పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలోని హనుమాన్ దేవాలయంలో బిజెపి రాష్ట్ర నాయకుడు చందుపట్ల సునీల్ రెడ్డి ఇతర బిజెపి నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు ఎడ్ల సదాశివ్, మండల అధ్యక్షులు వేల్పుల రాజు, ఎస్సి మోర్చ పట్టణ అధ్యక్షులు సూర్య, నాయకులు గీట్ల సమర, రిత్విక్ తదితరుల పాల్గొన్నారు.

# ఏనుగుల దాడిలో వ్యక్తి మృతి

చిత్తూరు పలమనేరు మండలం పెంగరగుంట పంచాయతీ ఇంద్రానగర్ ఏనుగులు బీభత్సం సృష్టించాయి. గ్రామసమీపాన పంట పొలాల వద్ద నివాసముంటున్న ఇంటిపై బుధవారం తెల్లవారుజామున ఏనుగుల గుంపు దాడికి పాల్పడింది. పొలము వద్ద నిద్రిస్తున్న యానాది సుబ్రమణి అనే రైతుపై ఏనుగుల దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన సుబ్రమణి అక్కడికక్కడే మృతి చెందాడు. ఏనుగుల బీభత్సంతో గ్రామస్థులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

# ఏసీబీ వలలో ఫారెస్టు అధికారులు

శంషాబాద్ రంగారెడ్డి జిల్లా గగన్ పహాడ్ లోని ఫారెస్ట్ రేంజ్ ఆఫీస్ లో ఏసీబీ సోదాలు, ఒక వ్యాపారి నుండి 80 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్ గా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్యామ్ కుమార్, సెక్షన్ ఆఫీసర్ పీర్యానాయక్ దొరికిపోయారు. నగరంలోని ఉప్పల్ ప్రాంతానికి చెందిన వెంకటేష్ అనే వ్యాపారి శంషాబాద్ మండల్ కొత్వాల్ గూడ సమీపంలో సామిల్ (టింబర్ డిపో) ఏర్పాటుచేయడానికి లైసెన్స్ కోసం దరఖాస్తు చేయగా పీర్యా నాయక్ 80000 రూపాయలు డిమాండ్ చేయడంతో ఏసీబీ ని ఆశ్రయించాడు. రేంజ్ ఆఫీసర్ శ్యామ్ కుమార్ ర్ సెక్షన్ ఆఫీసర్ పీర్యా నాయక్ లను అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు వారసిగూడ లోని శ్యామ్ కుమార్ ఇంటిలోనూ, షాద్ నగర్ లోని పీర్యా నాయక్ ఇంటి వద్ద కూడా ఎసిబి అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు.

# అడ్డూ అదుపు లేకుండా ధరలను పెంచేస్తున్న కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు




కర్నూలు మే 25 :- అడ్డూ అదుపు లేకుండా ధరలను పెంచేస్తున్న కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల మొండి వైఖరిని నిరసిస్తూ మే 30 వ తేదీన కర్నూలు కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని బుధవారం రోజు పెట్రోల్ పంపుల ముందు నిరసన కార్యక్రమాలు చేసి వామపక్ష పార్టీలు కరపత్రాలు పంపిణీ చేశారు . ఈ కార్యక్రమానికి సిపిఎం పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు అబ్దుల్ దేశాయ్ అధ్యక్షత వహించగా సిపిఎం పార్టీ నగర కార్యదర్శి ఎం రాజశేఖర్ ,సిపిఐ నగర సహాయ కార్యదర్శి చంద్రశేఖర్, ఎస్ యు సి ఐ జిల్లా కార్యదర్శి నాగన్న లు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైఎస్ఆర్సిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పెరిగే ధరలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని పేద మధ్యతరగతి ప్రజలు బ్రతకడమే కష్టంగా మారిందని, ఇటువంటి దిక్కుమాలిన ప్రభుత్వాలను ప్రజలు సహించరని, వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తారని తెలియజేశారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం , రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు నరేంద్రమోడీ,జగన్మోహన్ రెడ్డి పేద, మధ్యతరగతి ప్రజలకు ఎన్నికల ముందుకల్లబొల్లి మాటలు చెప్పి, ఊదర కొట్టే ఉపన్యాసాలు ఇచ్చి ఆచరణకు సాధ్యంకాని హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన తర్వాత నిత్యావసర వస్తువుల ధరలు పెంచడం, విద్యుత్ ఛార్జీలు పెంచడం, పెట్రోల్ డీజిల్ వంటగ్యాస్ ధరలు పెంచడమే కాక అద్దె విలువపై ఇంటి పన్ను కాక ఆస్తి విలువ పైన ఇంటి పన్ను , మంచి నీటి పై పన్ను పెంచి ఇది సరిపోవట్లేదు అని ప్రజలపై చెత్త పన్ను వేయడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. ఈ దేశంలో ఆదాని, అంబానీలు అతి తక్కువ కాలంలో ప్రపంచ కుబేరుల జాబితాలో టాప్ టెన్ లో నిలిచారని, వీరే మనదేశంలోని బ్యాంకులలో ఆస్తికి మించిన అప్పులు తీసుకుని కట్టలేక బ్యాంకులను దివాలా తీయించారు అని , ఇటువంటి దొంగలకు లక్షల కోట్లలో రాయితీలు ఇచ్చి పేద ప్రజలకు ధరలు పెంచి పన్నుల రూపంలో భారాలు వేయడం సరైన పద్ధతి కాదని అందుకే ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా ఈనెల 30వ తేదీ కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ,సిపిఐ ,సిపిఐ ఎంఎల్ ,సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ , ఎస్ యు సి ఐ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# "పండుగ వాతావరణంలా గడప గడపకు మన ప్రభుత్వం" కార్యక్రమం



ఓర్వకల్లు రిపోర్టర్ (నేటి గళం) మే 25 :- పాణ్యం ఎమ్మెల్యే, టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులు , వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పాణ్యం నియోజకవర్గ పరిధిలోని, ఓర్వకల్లు మండలం చెన్నంశెట్టి పల్లె గ్రామంలో గడప,గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.పండుగ వాతావరణాన్ని తలపించేలా గడప, గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతోంది.గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి కి అడుగడుగునా జనం నీరాజనాలు పట్టారు...ఎమ్మెల్యే , నాయకులు చెన్నంశెట్టి పల్లె గ్రామంలోని ప్రతీ గడపకు వెళ్లి రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న జనరంజక పాలన,అవినీతి రహిత పాలన గురించి ప్రజలకు వివరించారు.ఇంకా ఎవరికైనా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం

## అడుగడుగునా జన నీరాజనాలు...

లేదా,అందకపోతే వాటి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారించాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి సూచించారు .ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ సర్పంచ్ మదన్ రెడ్డి, ఓఖుఅ రామ మద్దిలేటి,జిఖుఅ రంగనాథ్ గౌడ్, ఓఖఖ తిప్పన్న,కృష్ణారెడ్డి, హుస్సేనాపురం పెద్ద స్వామి,ఇంకా పలువురు చుట్టుపక్కల గ్రామాల సర్పంచులు, నాయకులు గ్రామ,మరియు మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయ సిబ్బంది ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి తగిన సహాయ సహకారాలు అందించాలి

-: కర్నూలు జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు



కర్నూలు , వే,25:-సచివాలయ సిబ్బంది ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి తగిన సహాయ సహకారాలు అందించాలని కర్నూలు జిల్లా కలెక్టర్ ఆదేశించారుబుధవారం గోనెగండ్ల మండలం హెచ్.కైరవాడి గ్రామంలోని గ్రామ సచివాలయం - 1 , గ్రామ సచివాలయం-2 లను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వాలంటీర్లు సచివాలయానికి వచ్చినప్పుడు తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు వేసేలా చూడాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. సిటిజన్ ఔట్ రీచ్ కార్యక్రమంలో భాగంగా ప్రతి శనివారం గ్రామంలో తిరుగుతూ ప్రజలకు సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారాలకు కృషి చేయాలన్నారు. . జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం సంబంధించిన డాక్యుమెంట్ లను లబ్ధిదారులు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు అత్యవసర సర్వీసులు సకాలంలో అందిస్తున్నారాలేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలు బియాండ్ ఎస్ఎల్ఏ వెళ్లకుండా వాటిని పరిష్కరించాలన్నారు.ఎస్ఎల్ఏ గడువులోగా ప్రజా సమస్యల పరిష్కార చర్యల నివేదిక, సిబ్బంది హాజరు పట్టిక, ఓటిఎస్ అక్నాలెడ్జ్మెంట్ రిజిస్టర్, ఉద్యోగుల మూవ్మెంట్ రిజిస్టర్ జిల్లా కలెక్టర్ పరిశీలించారు.

# కుల మతాల మధ్య చిచ్చు పెడుతున్న రాజకీయ పెద్దలు

-:ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు బి బతుకన్న




కర్నూలు మే 25 :- దేశంలో , రాష్ట్రంలో రాజకీయ పెద్దలు కులాల మధ్య మతాల మధ్య చిచ్చు పెడుతున్నారని ఐఎన్టియుసి కర్నూలు జిల్లా అధ్యక్షులు బి బతుకన్న విమర్శించారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం కర్నూలు ఎఐౖజఅ కార్యాలయం నందు జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వంలో సర్వమతాలను సమానంగా చూసి పరిపాలన సాగించారని అలాగే ఒక దళితుడిని దామోదరం సంజీవయ్య ని ముఖ్యమంత్రిగా,

అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదని నేడు కేంద్రంలో ప్రధాని మోడీ ప్రభుత్వంలో దళితులకు ముస్లింలకు రక్షణ లేకుండా పోయిందని ఆరెస్సెస్ వారికి ప్రాధాన్యత నిస్తూ మోడీ నిరంకుశ పాలన సాగిస్తున్నారని అలాగే రాష్ట్రంలో నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన అభివృద్ధిని చూసి జగన్మోహన్ రెడ్డి ని గెలిపించారని కానీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్నారని అమలాపురం సంఘటన ప్రభుత్వం చేతగాని తనానికి నిదర్శనమని జిల్లాలకు దేశ నాయకుల పేర్లు పెట్టవద్దంటూ కొందరు వ్యతిరేకించి రాష్ట్రంలో కలహాలు సృష్టిస్తున్నారని జగన్ పాలనలో రాష్ట్ర అభివృద్ధి శూన్యమని ఇప్పుడు ప్రజలు ప్రభుత్వంపై పూర్తి వ్యతిరేకత చూపిస్తున్నారని ఎఐౖజఅ జిల్లా అధ్యక్షుడు బి బతుకన్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను విమర్శించారు. ఈ కార్యక్రమంలో మంత్రాలయం కాంగ్రెస్ ఇన్చార్జి యస్ బాబురావు సేవాదళ్ చైర్మన్ సజ్జాద్ హుస్సేన్ ఐఎన్టీయూసీ నాయకులు మద్దిలేటి ఏం సుంకన్న కె గోవిందు ఏం వెంకటేష్ మొదలగు వారు పాల్గొన్నారు.

# నాగచైతన్య నుంచి బిగ్ సర్ ప్రైజ్ రెడీ

క్రేజీ హీరో అక్కినేని నాగచైతన్య తన ఫ్యాన్స్ కి సర్ ప్రైజ్ ఇవ్వడానికి రెడీ అయిపోయాడు. మరో రెండు రోజుల్లో తన అభిమానులకు గుడ్ న్యూస్ చెప్పబోతున్నాడు. వివరాల్లోకి వెళితే.. విభిన్నమైన సినిమాలని ఎంచుకుంటూ హీరోగా తన ప్రత్యేకతని చాటుకుంటున్నారు యంగ్ హీరో నాగచైతన్య. ఇదే




ఏడాది 'లాల్ సింగ్ చద్దా' తో బాలీవుడ్ బాట పడుతున్న చై తెలుగులో చేస్తున్న మూవీ థాంక్యూ'. 'మనం' ఫేమ్ విక్రమ్ కె. కుమార్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.స్టార్ ప్రొడ్యూసర్స్ దిల్ రాజు శిరీష్ ఈ మూవీని నిర్మిస్తున్నారు. రాశీఖన్నా మాళవిక నాయర్ అవికా గోర్ హీరోయిన్ లుగా నటిస్తున్నారు. రొమాంటిక్ కామెడీ ఎంటర్ టైనర్ గా రూపొందుతున్నఈ మూవీ జూలై 8న ప్రపంచ వ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కాబోతున్న విషయం తెలిసిందే. ఈ మూవీ టీజర్ ని మే 25న విడుదల చేస్తున్నారు. ఈ విషయాన్ని మేకర్స్ అధికారికంగా ప్రకటిస్తూ సోమవారం ఓ పోస్టర్ ని విడుదల చేశారు. టీజర్ ని మే 25 సాయంత్రం 5:04 నిమిసాలకు విడుదల చేస్తున్నట్టుగా ప్రకటించారు.పోస్టర్ తో పాటు టీజర్ అనౌన్స్ మెంట్ వీడియోని వినూత్నంగా విడుదల చేశారు. నాగచైతన్య తన పాత్రకు డబ్బింగ్ చెబుతుండగా ఓ వ్యక్తి వీడియో తీయడం.. ఏం జరుగుతోంది విక్రమ్ అంటూ చై దర్శకుడు విక్రమ్ ని అడగడం.. అది టీమ్ రిలీజ్ అనౌన్స్ మెంట్ కోసం అని చెప్పడం.. అందుకు చై ఎక్సైట్ అవుతూ నిజమా అని ఆనందాన్ని వ్యక్తం చేయడం ఆకట్టుకుంటోంది.వినూత్నమైన చిత్రాలతో ఆకట్టుకుంటూ దర్శకుడిగా ప్రత్యేతను చాటుకున్న విక్రమ్ కె కుమార్ 'థాంక్యూ'ని కూడా ఎవరూ ఎక్స్ పెక్ట్ చేయని కథతో తెరకెక్కిస్తున్నాడు. ఇందులో హీరో నాగచైతన్య 'సూపర్ స్టార్ మహేష్ బాబుకు హార్డ్ కోర్ ఫ్యాన్ గా కనిపించబోతున్నాడట. ఇప్పటికే బయటికి వచ్చిన ఓ వీడియో ఈ విషయాన్ని స్పష్టం చేసింది. భారీ మహేష్ కటౌట్ కు నాగచైతన్య పాలభిషేకం చేస్తున్న ఓ సన్నివేశానికి సంబంధించిన వీడియో ఆ మధ్య నెట్టింట సందడి చేసిన విషయం తెలిసిందే.దీంతో చై ఇందులో మహేష్ బాబు కు హార్డ్ కోర్ ఫ్యాన్ గా కనిపించబోతున్నాడని స్పష్టమైంది. చై కెరీర్ లోనే మర్చిపోలేని విధంగా తెరక్కుతున్న ఈచిత్రానికి లెజెండరీ సినిమాటోగ్రాఫర్ పీసీ శ్రీరామ్ ఛాయాగ్రహకుడిగా వ్యవహరిస్తున్నారు. తమన్ సంగీతం బీవీఎస్ రవి కథ అందిస్తున్నారు. ఈ మూవీపై నాగచైతన్య భారీ అంచనాలు పెట్టుకున్నారట.

# 'ఎఫ్ 3' కోసం వాళ్లంతా రెడీ?

ఇటీవల బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా చిత్రాలు బాక్సాఫీస్ వద్ద సందడి చేశాయి. భారీ చిత్రాలు లార్జర్ దెన్ లైఫ్ మూవీస్ కావడం గత రెండేళ్లుగా ఈ సినిమాల కోసం ప్రేక్షకుల భారీ స్థాయిలో ఎదురుచూడటంతో చాలా వరకు ఫ్యామిలీస్ తో సహ చాలా మంది థియేటర్లకు వచ్చారు సందడి చేశారు. అయితే ఆ తరువాత విడుదలైన సినిమాలకు ఫ్యామిలీ ప్రేక్షకుల సందడి కనిపించడం లేదు. పెద్దగా ఆసక్తిని కూడా చూపించడం లేదు. ఇటీవల విడుదలైన 'పుష్ప ట్రిపుల్ ఆర్ కేజీఎఫ్ 2 చిత్రాల కోసం థియేటర్లకు భారీగా ఫ్యామిలీ ఆడియన్స్ కూడా వచ్చి సందడి చేశారు.అయితే కొంత గ్యాప్ తరువాత మళ్లీ అదే తరహా ఫ్యామిలీ సందడి థియేటర్లలో కనిపించనుందని తెలుస్తోంది. రీసెంట్ గా ఫ్యామిలీస్ థియేటర్లకు వచ్చినా భారీ స్థాయిలో మాత్రం థియేటర్లలో




ఫ్యామిలీ ఆడియన్స్ సందడి కనిపించలేదు. ఈ నేపథ్యంలో ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా తెరకెక్కిన 'ఎఫ్ 3' కోసం మహిళా ప్రేక్షకులు భారీ సంఖ్యలో థియేటర్లలో సందడి చేయడం ఖాయంగా కనిపిస్తోంది. విక్టరీ వెంకటేష్ వరుణ్ తేజ్ హీరోలుగా తమన్నా మెహరీన్ మోనాల్ చౌహాన్ హీరోయిన్ లుగా నటించిన ఈ మూవీపై బజ్ బాగానే వుంది.గతంలో వచ్చి 'ఎఫ్ 2' కు ప్రధాన బలంగా నిలిచింది ఫ్యామిలీసే. అదే పంథాలో తెరకెక్కిన 'ఎఫ్ 3'కు కూడా వాళ్లే బలంగా నిలబడబోతున్నారని చెబుతున్నారు. ఈ మూవీ టోటల్ వరల్డ్ వైడ్ బిజినెస్ 80 కోట్లు. బ్రేక్ ఈవెన్ సాధించాలంటే ఈ మొత్తాన్ని రాబట్టాల్సిందే. యావరేట్ టాక్ ని సొంతం చేసుకున్నా ఈ మొత్తం ఈజీగా బ్రేక్ ఈవెన్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. సినిమాపై క్రేజ్ ఇప్పటికే మొదలైంది. దాంతో బుకింగ్స్ కూడా బాగున్నాయి. సినిమాపై భారీ క్రేజ్ వుంది కాబట్టే ఈ మూవీని అత్యధిక మొత్తానికి నిర్మాత దిల్ రాజు అమ్మేశారు. నైజాం మాత్రం ఆయనే రిలీజ్ చేస్తున్నారు. నైజాం ఏరియా వర్త్ 22.5 కోట్లుగా చెబుతున్నారు. తెలుగు స్టేట్స్ థియేట్రికల్ రైట్స్ అంతా కలిపి 63 కోట్లు దాటిందంట. ఓవర్సీస్ కర్ణాటక అంతా కలిసి మొత్తంగా 80 కోట్ల వరకు అమ్మేశారు. బ్రేక్ ఈవెన్ కావాలంటే ఈ భారీ మొత్తం రాబట్టాల్సిందే.అయితే సినిమాపై ఏర్పడిన క్రేజ్ పరంగా చూస్తే ఇదేమంతా కష్టం కాదని యావరేజ్ టాక్ వచ్చినా 'ఎఫ్3' ఆ మొత్తాన్ని రకాబట్టేస్తుందని ఈ సినిమా కోసం ఫ్యామిలీ ఆడియన్స్ ఆసక్తిగా చూస్తున్నారని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి.

# డార్లింగ్ ఫ్యాన్స్ లో సలార్ కన్ ఫ్యూజన్!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో భారీ యాక్షన్ ఎంటర్ టైనర్ 'సలార్' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ప్రభాస్ మ్యాన్లీ లుక్ నుంచి సినిమాటోగ్రాఫర్ భువన గౌడ ఇస్తోన్న లీక్స్ వరకూ ప్రతీది సినిమాపై అంచనాల్ని అంకంతకు పెంచేస్తున్నాయి.ఇటీవలే సలార్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. కేజీఎఫ్ ని మించి మూడు రెట్లు అధికంగా సలార్ ఉంటుందని బాంబ్ పేల్చారు. కంటెంట్..యాక్షన్..విజువలైజేషన్ ఇలా ప్రతీది సినిమాలో హైలైట్ ఆ నిలుస్తుందని అంచనాలు మొదలయ్యాయి . దీంతో అభిమానుల్లో ఆశలు రెట్టింపు అయ్యాయి. డార్లింగ్ కటౌట్ కి తగ్గ సిసలైన కంటెట్ తో రాబోతున్నాడని హైప్ క్రియేట్ అవుతుంది. ఎలాంటి ఇమేజ్



లేని యశ్ ని కేజీఎఫ్ తో పాన్ ఇండియా స్టార్ చేసాడు.అలాంటి మేకర్ పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ని ఇంకే రేంజ్ లోచూపిస్తాడో చెప్పాల్సిన పనిలేదంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. 'సలార్' నుంచి వచ్చే ప్రతీ అప్ డేట్ కోసం ఎంతో ఎగ్జైట్ మెంట్ తో ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో లీక్ చేసిన చిన్నబీటీఎస్ వీడియో ఇప్పుడు అభిమానుల్ని గందరగోళానికి గురి చేస్తుంది. సినిమా సెట్ నుంచి యాక్షన్ సీన్స్ ని చిత్రీకరిస్తున్న సమయంలో తీసిన వీడియో ఒకటి నెట్టింట వైరల్ గా మారింది.సీన్ లో జీపులు దుమ్ము రేపుతూ వెళ్లడం గమనించ వచ్చు. బ్లాక్ అండ్ వైట్ లో ఉన్న ఈ వీడియో ఇప్పుడు డార్లింగ్ ఫ్యాన్స్ లో ప్రకంపనలు సృష్టిస్తుంది. ఇది సలార్ యాక్షన్ వీడియో అంటూ అభిమానులు భావిస్తున్నారు. కానీ ఇలాంటి సీన్ ని కేజీఎఫ్ లో చూసాం. ఆ వీడియోనే ఇప్పుడు సినిమాటోగ్రాఫర్ ఇలా షేర్ చేసారని కొందరు అంటుంటే..మరికొంత మంది సలార్ లీక్ అంటూ సంబర పడుతున్నారు.ఈ వీడియోని ఉద్దేశించి భువన గౌడ ఇంట్రెస్టింగ్ కామెంట్ కూడా ఎట్టారు. ఇది అంత సులభం కాదు అని దాని వెనుక ఉన్న శ్రమని చెప్పే ప్రయత్నం చేసారు. అయితే ఇది నిజంగా పాత వీడియో అయితే ఇప్పుడెందుకు షేర్ చేసినట్లు? ప్రస్తుతం సలార్ సెట్స్ లో ఉంది కాబట్టి..దాని అప్డేడ్ అయి ఉండొచ్చుగా? అని సందేహాలు తెరపైకి వస్తున్నాయి. మరి ఈ చిక్కు ముడి వీడాలంటే అసలు సంగతేంటి? అన్నది చెప్పాల్సి ఉంది.ఇప్పటివరకూ సలార్ షూటింగ్ 30 శాతమే పూర్తయింది. ఔట్ ఫుట్ బాగా వచ్చిందని టీమ్ ధీమా వ్యక్తం చేసింది. బ్యాలెన్స్ అంతకు మంచి బెస్ట్ ఇవ్వడానికి ప్రశాంత్ శ్రమిస్తున్నారు. రేయింబవళ్లు టీమ్ సలార్ కోసం పనిచేస్తుందన్నారు. భువన గౌడ్ మాటల్ని బట్టి సలార్ ని హంబోలే ఫిల్మ్స్ ఎంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుందో అంచనా వేయొచ్చు.బడ్జెట్ పరంగా 500 కోట్లు దాటే ఉంటుందని టాక్ వినిపిస్తుంది. ఇప్పటివరకూ ఇండియన్ సినిమా బడ్జెట్ 500 కోట్లు దాటింది లేదు. రెండు భాగాలకు కలిపి ఖర్చు చేసారు తప్ప..ఒకే భాగానికి అన్ని కోట్లు వెచ్చింది లేదు. ఆ లెక్కన 'సలార్' బడ్జెట్ పరంగా రికార్డు ముందే సృష్టించే అవకాశం ఉంది.

# ఎలిమినేటర్ మ్యాచ్‌లో విజయం వాళ్లదే.. కారణమిదే: టీమిండియా మాజీ క్రికెటర్




ఐపీఎల్-2022లో మరో ఆసక్తికరపోరుకు రంగం సిద్ధమైంది. ఈ సీజన్‌తో క్యాష్ రిచ్ లీగ్‌లో ఎంట్రీ ఇచ్చిన లక్నో సూపర్ జెయింట్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య ఎలిమినేటర్ మ్యాచ్ జరుగనుంది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా బుధవారం(25) నాటి పోరుకు ఇరు జట్లు సన్నద్ధమవుతున్నాయి. ఇక ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు క్వాలిఫైయర్-1లో ఓడిన రాజస్తాన్ రాయల్స్‌తో తలపడుతుంది. క్వాలిఫైయర్-2లో గనుక గెలుపొందితే గుజరాత్ టైటాన్స్‌తో పాటు ఫైనల్లో అడుగుపెట్టి టైటిల్ రేసులో నిలుస్తుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే మూడుసార్లు వరుసగా ప్లే ఆఫ్స్ చేరిన ఆర్సీబీ, అరంగేట్రంలోనే అదరగొట్టిన లక్నో విజయంపై కన్నేశాయి.ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ క్రికెటర్, వివాదాస్పద వ్యాఖ్యాతగా పేరొందిన సంజయ్ మంజ్రేకర్ ఎలిమినేటర్ మ్యాచ్ విజేతను అంచనా వేశాడు. లక్నో మీద ఆర్సీబీ గెలుస్తుందని జోస్యం చెప్పాడు. ఈ మేరకు ఈఎస్‌పీఎన్‌క్రిక్‌ఇన్ఫోతో అతడు మాట్లాడుతూ.. ''బెంగళూరుకు విజయావకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.వాళ్లకు స్టార్ ప్లేయర్లు ఉన్నారు. ఫాఫ్ డుప్లెసిస్ ఐపీఎల్ రికార్డు ఓసారి చూడండి. ప్లే ఆఫ్స్‌లో అతడు మరింతగా రెచ్చిపోతాడు. ఇక విరాట్ కోహ్లి కూడా గేరు మార్చాడు. అనుభవం కలిగిన ఆర్సీబీ జట్టు ఇలాంటి కీలక మ్యాచ్‌లలో ఒత్తిడిని అధిగమించి మంచి ప్రదర్శన నమోదు చేయగలదు. కాబట్టి వాళ్లు గెలుస్తారు'' అని అభిప్రాయపడ్డాడు.కాగా గత సీజన్‌లో చెన్నై సూపర్‌కింగ్స్‌కు ప్రాతినిథ్యం వహించిన ఫాఫ్.. ఫైనల్లో కేకేఆర్‌పై 59 బంతుల్లో 86 పరుగులు చేసి తమ జట్టును చాంపియన్‌గా నిలపడంలో కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. ఇక గుజరాత్‌తో మ్యాచ్‌లో కోహ్లి ఫామ్‌లోకి వచ్చాడు. 54 బంతుల్లో 73 పరుగులు సాధించాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190